**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 117, పేజీలు - 08

బుధవారం,అక్టోబర్ 28, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# తెలంగాణలో చలి పంజా

**- రాత్రివేళ పడిపోతున్న ఉష్ణోగ్రతలు, తెలంగాణలో పెరుగుతున్న చలితీవ్రత - పటాన్‌చెరులో 13 డిగ్రీలు, పెద్దేముల్‌లో 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత**

**- రాత్రి చలి.. పగలు ఎండ సెగలు, మబ్బులు లేకపోవడంతో చలిగాలుల ప్రభావం**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో చలి మొదలైంది. రాత్రివేళ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతుండటంతో చలితీవ్రత క్రమంగా పెరుగుతోంది. చలిగాలులు వీస్తుండగా, అక్కడక్కడా పొగమంచు కూడా కురుస్తోంది. దీంతో పగటిపూట ఉక్కపోత నుంచి ఉపశమనం లభిస్తున్నప్పటికీ, రాత్రిపూట మాత్రం చలి ప్రజలను వణికిస్తోంది. గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సోమవారం పటాన్‌చెరులో 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల దిగువకు పడిపోవడం ఇదే తొలిసారి. హైదరాబాద్‌లోనూ రాత్రి ఉష్ణోగ్రతలు 4 నుంచి 5 డిగ్రీల మేర తగ్గడం చలితీవ్రత పెరుగుతోందనే సంకేతాలను ఇస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కన్నా తక్కువగా నమోదవుతున్నాయి.

### మబ్బులు లేకపోవడంతో పెరుగుతున్న చలి

ఆకాశంలో మబ్బులు లేకపోవడంతో చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతుండటంతో రాత్రివేళ చలి ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. చలిగాలులకు తోడు అక్కడక్కడా పొగమంచు కురుస్తుండటంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

### రాత్రి చలి.. పగలు ఎండ

రాత్రివేళ ఉష్ణోగ్రతలు పడిపోతూ చలి తీవ్రత పెరుగుతున్నప్పటికీ, పగటిపూట మాత్రం ఎండల ప్రభావం తగ్గడం లేదు. కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదవుతుండటం గమనార్హం. రంగారెడ్డి జిల్లాలోని బాలాపూర్, సరూర్‌నగర్, మేడ్చల్ జిల్లాలోని కీసర, వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు



మించి నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో రాత్రిపూట చలి, పగటిపూట ఎండలు అనే భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. రాబోయే రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాలతో రాత్రివేళ ఉష్ణోగ్రతల మార్పులపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

**జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు**

# మా పోరాటం ఆగదు

**- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు లేదా ప్రధాని మోదీ ఆయన్ను సీఈసీ పదవి నుంచి తొలగించే వరకు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు తమ నిరసనలను ఆపబోవని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలో కోట్లాది మంది ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని ఆరోపించారు. తాము చాలా కాలంగా ఓట్ చోరీ అంశాన్ని లేవనెత్తుతున్నామని అన్నారు. అయితే ఇప్పుడు అత్యున్నత స్థాయిలో ఓట్లు చోరీ అవుతున్నాయని యావత్ దేశం అర్థం చేసుకోవడం ప్రారంభించిందని తెలిపారు. దేశ రాజధానిలోని త్రిలోక్‌పురిలో జరిగిన జన్ సున్వాయి

2లో..

**కేటీఆర్, హరీశ్ రావు**

# భ్రమల్లో ఉన్నారు

**- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో వంద అసెంబ్లీ స్థానాలను గెలుచుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మీడియాతో చిట్ చాట్ లో భాగంగా రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షాల విమర్శలు, రానున్న ఎన్నికలపై ఆయన పలు వ్యాఖ్యలు చేశారు.

### వంద సీట్లే లక్ష్యం

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 అసెంబ్లీ స్థానాలను సాధించడమే తమ ప్రధాన లక్ష్యమని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉందని, పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేస్తున్నాయని అన్నారు. తమ సీఎం పార్టీ నేతలకు స్వేచ్ఛగా పనిచేసే అవకాశం ఇచ్చారని, నాయకుల మధ్య సమన్వయం బాగుందని చెప్పారు. దేశంలో తమకు ఉన్నంత సమన్వయం మరెక్కడా లేదని వ్యాఖ్యానించారు.

### కేటీఆర్, హరీశ్ రావుపై విమర్శలు

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకోవడం లేదని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బలం, ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజల్లోకి వెళ్లి పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు. ఎల్‌నినో ప్రభావంపై హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలను మహేశ్ కుమార్ గౌడ్ తప్పుబట్టారు. ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలో నెలకొన్న

2లో..

**రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది: కేటీఆర్**



**హైదరాబాద్,(ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తిపోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు. "రాష్ట్రం ప్రస్తుతం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో

2లో..

**పల్లెల్లో అభివృద్ధి పరుగులు..**

# కూటమిలో ఐక్యతే ఉరుకులు

- **బీఫాం దక్కనివారు పంతాలు వీడాలి - త్యాగం చేసిన వారికి భవిష్యత్తులో అవకాశాలు..**
- **స్థానిక ఎన్నికల్లోనూ 2024 స్ఫూర్తిని చాటాలి: పవన్ కల్యాణ్**
- **పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో రూ.1.50 లక్షల కోట్ల పనులు.**
- **అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యమని వెల్లడి**

**అమరావతి(ప్రశ్న న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికల వేళ కూటమి ఐక్యతను కాపాడుకోవడమే లక్ష్యంగా అగ్రనాయకత్వం రంగంలోకి దిగింది. సీట్ల సర్దుబాటులో ఎదురైన సవాళ్లను అధిగమించి, బీఫాంలు అందుకున్న అభ్యర్థుల విజయానికి మూడు పార్టీల శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. టికెట్లు ఆశించి భంగపడిన నాయకులు, కార్యకర్తలు అసంతృప్తికి లోనుకాకుండా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారు. త్యాగాలు చేసిన వారికి భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మరోవైపు కూటమి

2లో..




**గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని**

# విజయవంతం చేయండి

**- ఏర్పాట్ల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ ప్రపంచస్థాయిలో పెరిగే అవకాశం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి ఎల్లుండి ఢిల్లీలో జరగనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. సీఈవోలు, ప్రతినిధులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, మన విజయాలను అతిథులకు చాటిచెప్పేలా హైదరాబాద్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై రేవంత్ రెడ్డి సమీక్షించారు. గ్లోబల్ సమ్మిట్, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలపై, రక్షా ఎక్స్ పో, ఇండియా జాయ్ ఈవెంట్లపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో పలు చోట్ల డ్రోన్ ఆధారిత ప్రచారం చేపట్టాలని,

2లో..



# అర్ణబ్ తుపాను ఎఫెక్ట్..

**తెలంగాణలో వర్ష సూచన**

2లో..



# పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా

**- భయపడొద్దు.. తిరగబడండి**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** "ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు."మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి

2లో..



# నీటి వృథాను అరికట్టేందుకు యాప్

**- నవంబర్ 1న విడుదల!**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో ప్రజలు మంచినీటిని వృథా చేయకుండా ఉండాలని జలమండలి తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో పరిమితంగా ఉన్న నీటి వనరులను కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు. ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై జలమండలి ఉక్కుపాదం మోపుతోంది. నీటిని వృథా చేయవద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేస్తోంది. హైదరాబాద్‌లో నీటి వృథాపై వాటర్ బోర్డు అధికారులు సమావేశమయ్యారు.

### నవంబర్ 1న యాప్ విడుదల

పోలీసులను పెట్టి హైదరాబాద్? నగరంలో మంచినీటి వృథాను అరికట్టలేమని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. నీటివృథా విషయంలో జరిమానాలు విధించడం జలమండలి ఉద్దేశం కాదని, ప్రజల్లో అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం జలమండలి టెక్నికల్ టీం ప్రత్యేక యాప్?ను రూపకల్పన చేసినట్లు అశోక్ రెడ్డి వివరించారు. ఈ యాప్?లో నీటి వృథాకు సంబంధించిన ఫొటోలు, లొకేషన్‌ను అప్‌లోడ్ చేస్తే వెంటనే జలమండలి స్పందించి వివరాలను ఆరా తీసి, వారికి జరిమానా విధిస్తుందని తెలిపారు. వాటర్ బిల్లుతో పాటు ఫైన్?ను కూడా కలిపి చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. నీటి వృథా జరిగినప్పుడు దానిపై ఫిర్యాదు చేసేవారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. మరోవైపు జలమండలి రూపొందించిన ప్రత్యేక యాప్ హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నవంబర్ 1న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

2లో..

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు మా పోరాటం ఆగదు

కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

### ప్రజా ఉద్యమాన్ని అణచివేసేందుకు మోదీ- షా కుట్ర

ఓట్ చోరికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఈ ఉద్యమాన్ని దారి మళ్లించే వారి ఎత్తుగడలు, బూటకపు ప్రచారం కేవలం ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తోందని మండిపడ్డారు. దేశంలోని ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు ఇండియా కూటమి తన ప్రజాస్వామ్య పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ఎన్నికల సంఘం రహస్యాలు బయటపడుతూ, ఓట్ చోరీ బట్టబయలవుతున్న వేళ మోదీ–షా ద్వయం సర్కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు! వారు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఎందుకు కాపాడుతున్నారు?. ఈ దారి మళ్లించే ఎత్తుగడలు, బూటకపు ప్రచారం కేవలం మోదీ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తూ, దేశ ప్రజాస్వామ్యాన్ని మసకబారుస్తున్నాయి" అని ఖర్గే పేర్కొన్నారు.

### దేశ ప్రజలను గొంతు నొక్కేందుకు మోదీ సర్కార్ యత్నం : కేసీ వేణుగోపాల్

మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్ష కూటమి చేపట్టాలనుకున్న కార్యక్రమానికి అధికారులు అనుమతి నిరాకరించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. ఇప్పటికే ఎన్నికల వ్యవస్థను నాశనం చేసిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు ప్రజల గొంతును నొక్కేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. నవంబర్ 1న రాంలీలా మైదానంలో జరగబోయే విపక్షాల ఉమ్మడి ర్యాలీకి ముందు ఇండియా కూటమి పార్టీలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా బహిరంగ అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే కార్యక్రమాన్ని నిర్వహించాలనుకున్నాయని వివరించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని అశోక్ హోటల్ మొదట ఈ కార్యక్రమానికి తమకు అనుమతి ఇచ్చిందని, అయితే పోలీసుల జోక్యం తర్వాత పర్మిషన్ నిరాకరించిందని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో కేసీ వేణుగోపాల్ పోస్ట్ పెట్టారు. ఈ అనుమతి నిరాకరణ ఢిల్లీ పోలీసుల నిర్ణయం కాదు. ఇది ప్రధాని మోదీ– షాల నిర్ణయం. వాళ్లు జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతున్నారు. మొదట మోదీ– షా ఎన్నికల వ్యవస్థను నాశనం చేశారు. ఇప్పుడు దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి పోరాడే వారి గొంతు నొక్కడానికి అన్ని రకాల కుతంత్రాలు పన్నుతున్నారు. ఏదీ ఏమైనప్పటికీ మోదీ–షాల కీలుబొమ్మ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించే వరకు మేము విశ్రమించం. ఒకవేళ మమ్మల్ని ఇక్కడ అడ్డుకుంటే అమిత్ షా, ప్రధాని మోదీ ఇంటికి వెళ్లి అక్కడ భారీ ధర్నా చేస్తాం. ఒక చిన్న సమావేశానికి కూడా మోదీ– షా భయపడుతున్నారని కేసీ వేణుగోపాల్ ధ్వజమెత్తారు.

# రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది: కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది" అని కేటీఆర్ మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు. అయితే కేటీఆర్ ఆరోపణలను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా చేయడం లేదని, ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

# కేటీఆర్, హరీశ్ రావు భ్రమల్లో ఉన్నారు

సమస్యలకు నవంబర్‌లో పరిష్కారం లభిస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ తర్వాత తమ దృష్టి ఎన్నికలపై ఉంటుందని స్పష్టం చేశారు.

### బీజేపీకి ఛాన్సే లేదు

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం బీజేపీకి ఉన్న 8 మంది ఎంపీల్లో ఇద్దరు గెలిచినా ఎక్కువేనన్న టీపీసీసీ చీఫ్ ఆ పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా మళ్లీ గెలవరని జోస్యం చెప్పారు. ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో 40 శాతం సీట్లు కాంగ్రెస్ పార్టీకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ పార్టీకి ప్రజల్లో మద్దతును పెంచుతాయని మహేశ్ కుమార్ గౌడ్ విశ్వాసం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఉందన్న మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ శ్రేణులే తమ ప్రధాన బలమని చెప్పారు.

# గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

క్లైమేట్ చేంజ్, ఏఐ రంగాలకు సంబంధించిన ప్రముఖులను ఆహ్వానించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సంప్రదాయాలు ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్ ఆవరణలో డిజైన్లు ఉండాలని, కాకతీయ కళా తోరణం, రామప్ప ఆలయం డిజైన్లకు ప్రాముఖ్యతను ఇవ్వాలని స్పష్టం చేశారు. బతుకమ్మ గురించి అతిథులు తెలుసుకునేలా ప్రత్యేక డిజైన్లు, ఏర్పాట్లు చేశామని అధికారులు సీఎం వివరించారు.

# అర్ణబ్ తుపాను ఎఫెక్ట్..

## – తెలంగాణలో వర్ష సూచన

హైదరాబాద్ అర్ణబ్ తుపాను ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురవనున్నాయి. బుధవారం తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం వుంది. 100?120 మి.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశముంది. గంటకు 50?60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం. వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు వున్నాయి. వరంగల్, కరీంనగర్‌లో 30 మి.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం వుంది. హైదరాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తేలికపాటి వానలు కురవనున్నాయి. ఇతర జిల్లాల్లోనూ అక్కడక్కడ వర్షాలు పడే ఛాన్స్ వుంది. అక్టోబర్ 30 తర్వాత హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో మళ్లీ వానలు కురవనున్నాయి.

# పోలింగ్ రోజున పులివెందులలో ఉంటా

దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు.

"కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు.కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు

# నీటి వృథాను అరికట్టేందుకు యాప్

అలాగే నల్లాలకు మోటార్లు బిగించి నీళ్లను తోడుతున్నవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు 800 మోటార్లను స్వాధీనం చేసుకున్నామని, ప్రజలు ఈ పద్ధతి మానుకోవాలని హితవు పలికారు. పైపులైన్ చివరి ఇంటి వ్యక్తికి కూడా నీళ్లు అందేలా సహకరించాలని అశోక్ చేశారు.ట్యాంకర్ల ద్వారా నీటి వృథాకు పాల్పడితే నవంబర్ 1 నుంచి సంబంధిత ట్యాంకర్ యజమానికి రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే ట్యాంకర్ రెండో సారి నిబంధనలు ఉల్లంఘిస్తే, రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నీటి లీకేజీలు, మూతలు లేని ట్యాంకర్లను ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద ఉపయోగించవద్దని అధికారులను అశోక్ రెడ్డి ఆదేశించారు.

# పల్లెల్లో అభివృద్ధి పరుగులు..

# కూటమిలో ఐక్యతే ఉరుకులు

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో చేపట్టిన పనులను వివరిస్తూ అభివృద్ధి ప్రగతిని వెల్లడించారు.మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎదురయ్యే సవాళ్లను సమష్టిగా అధిగమించాలని, 2024 సాధారణ ఎన్నికల్లో ప్రదర్శించిన ఐక్యతను మరోసారి చాటాలని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

### సీట్ల సర్దుబాటులో సవాళ్లు..

2024 సాధారణ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు సులభంగా పూర్తయిందని, స్థానిక సంస్థల ఎన్నికలకు వచ్చేసరికి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మూడు పార్టీల్లోనూ ఆశావహులు అధికంగా ఉండటం, క్షేత్రస్థాయి పరిస్థితులు, నాయకుల అంచనాల కారణంగా అభ్యర్థిత్వాల కోసం పోటీ పెరిగిందన్నారు. కొన్ని చోట్ల స్థానిక నాయకత్వాల మధ్య పరిష్కారం కావాల్సిన అంశాలు కూడా అధినాయకత్వం వరకు వచ్చాయని వివరించారు.అన్ని అంశాలను పరిశీలించి, పరస్పర చర్చలతో ఏకాభిప్రాయానికి వచ్చి బీఫాంల పంపిణీ చేపట్టామని తెలిపారు. పార్టీ తరఫున బీఫాంలు అందుకున్న అభ్యర్థుల విజయానికి మిగిలిన నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. టికెట్ రాలేదన్న అసంతృప్తితో కూటమి స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించవద్దని సూచించారు.టికెట్ దక్కలేదని దూరం కావద్దు పార్టీ నిర్ణయాన్ని గౌరవించి ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి. త్యాగాలు చేసిన వారికి భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తాం అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

### 93 శాతం అసెంబ్లీ స్థానాల్లో విజయం

2024 సాధారణ ఎన్నికల్లో మూడు పార్టీలు ఐక్యంగా ముందుకు సాగి 93 శాతం అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించాయని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. అలాంటి ఐక్యతనే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రదర్శించాలని కోరారు. స్థానిక సంస్థలు గ్రామస్థాయి నాయకత్వాన్ని పెంపొందించుకునేందుకు కీలకమైనవని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వాటి పాత్ర ముఖ్యమని చెప్పారు.స్థానిక ఎన్నికలను పూర్తిస్థాయి ప్రజాభిప్రాయ సేకరణగా కాకుండా, రెండున్నరేళ్ల పాలనకు సంబంధించిన ప్రజా స్పందనను తెలుసుకునే అవకాశంగా చూస్తున్నామని వివరించారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కొనసాగాలని, కూటమి స్ఫూర్తికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పల్లెల్లో అభివృద్ధి పనుల జోరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో పాలనను ముందుకు తీసుకెళ్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న రూ.30 వేల కోట్ల బకాయిలను చెల్లించినట్లు పేర్కొన్నారు.

### గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వం వెల్లడించిన ముఖ్యాంశాలు ఇవీ..

పల్లె పండుగ: గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, నీటి గుంటలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కింద రూ.20,390 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అడవి తల్లి బాట: రెండు దశల్లో రూ.3,458 కోట్లతో 3,630 కిలోమీటర్ల రహదారులు, 45 వంతెనలు, గిరిజన ఆవాసాలకు అనుసంధానంగా రహదారుల నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

### జలధార పనులు: రూ.30,156 కోట్లతో 50,300 పనులు చేపట్టినట్లు తెలిపారు.

జల్ జీవన్ మిషన్: 27.36 లక్షల కొత్త గ్రామీణ నీటి కనెక్షన్లు ఇచ్చినట్లు, రాష్ట్రంలోని గ్రామీణ ప్రజలకు తాగునీటి సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణ: 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంతో గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టు దిశగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

### ఇళ్ల పట్టాలు: పేదలకు 60 వేల ఇంటి పట్టాలు ఇచ్చినట్లు వివరించారు.

ఈ పనులతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతున్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

### పెట్టుబడులకు అనుకూల వాతావరణం..

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు వస్తున్న తీరు ప్రస్తావనకు వచ్చిందని చెప్పారు. రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు వచ్చినట్లు పేర్కొన్నారు.టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్, ఏఐ డేటా సెంటర్ల వంటి సంస్థలకు సంబంధించిన పెట్టుబడులపై దృష్టి సారించినట్లు వివరించారు. పోలవరం, హంద్రీనీవా, భోగాపురం విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళు న్నామని తెలిపారు.ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,035 ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలను కూడా ప్రస్తావించారు.

### జనసేన బలోపేతానికి సమయం పడుతుంది

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల కేటాయింపుపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు పవన్ కల్యాణ్ సమాధానమిచ్చారు. రాజకీయ పార్టీకి సంస్థాగత బలం ఒక్కరోజులో రాదని, క్షేత్రస్థాయిలో బలపడటానికి సమయం అవసరమని పేర్కొన్నారు.

టీడీపీకి నాలుగున్నర దశాబ్దాలుగా సంస్థాగత బలం ఉందని, జనసేన కూడా తనదైన పోరాటంతో ఎదుగుతోందని చెప్పారు.మూడు పార్టీల్లోనూ గత సాధారణ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశించడం సహజమన్నారు. అయితే పార్టీ నిర్ణయం మేరకు బీఫాంలు అందుకున్న అభ్యర్థుల కోసం మిగిలినవారు పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, అవసరమైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### తుపాను సహాయక చర్యల్లోనూ భాగస్వాములు కావాలి

'అర్ణబ్' తుపాను నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదని ఆకాంక్షించారు.

### వైసీపీ వ్యాఖ్యలపై స్పందన

వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందిస్తూ, ప్రజలకు రక్షణగా నిలవడంతోపాటు రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పవన్ కల్యాణ్ అన్నారు. గతంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని నిలబడ్డామని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో వారే నిర్ణయం తీసుకుంటారని వ్యాఖ్యానించారు.

# ఏపీలో మారిన ఎన్టీఆర్ భరోసా

## పెన్షన్ల పంపిణీ తేదీ

- నవంబర్ 1కి బదులుగా అక్టోబర్ 30నే లబ్ధిదారులకు డబ్బులు
- స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా షెడ్యూల్‌లో మార్పు
- అక్టోబర్ 29 నాటికి నగదు సిద్ధం చేయాలని అధికారుల ఆదేశం

**విజయవాడ** ప్రభుత్వం 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ లబ్ధిదారులకు కీలక సమాచారం అందించింది. ప్రతి నెలా 1వ తేదీన అందించే పెన్షన్లను, ఈసారి రెండు రోజుల ముందుగానే పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీని ప్రకారం, నవంబర్ 1వ తేదీకి బదులుగా అక్టోబర్ 30 నుంచే లబ్ధిదారులకు నగదు అందజేయనున్నారు. రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 1న రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్, నవంబర్ 3న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. సిబ్బంది అంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండటం, పోలింగ్ రోజున లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పెన్షన్ల పంపిణీని ముందుగానే పూర్తి చేయాలని భావించింది. ఈ మేరకు అక్టోబర్ 29వ తేదీ నాటికే పెన్షన్లకు అవసరమైన నగదును సిద్ధంగా ఉంచుకోవాలని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి, బ్యాంకు మేనేజర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్ 30న ప్రారంభమయ్యే ఈ పంపిణీ ప్రక్రియ, నవంబర్ 5వ తేదీ వరకు కొనసాగనుంది. ఎన్నికల కారణంగా ఈ నెలలో మాత్రమే ఈ మార్పు చేశామని, వచ్చే నెల నుంచి యథావిధిగా ఒకటో తేదీనే పెన్షన్లు పంపిణీ చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# లోక్‌తంత్ర బచావో ? అరాచకత హటావో

## – నవంబర్ 2న షా మహాపాదయాత్ర

**హైదరాబాద్ :** దేశంలో ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతపై రాజకీయ రగడ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఎన్నికల సంఘం పనితీరును తప్పుపడుతూ కాంగ్రెస్ సారథ్యంలోని 'ఇండీ' కూటమి దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో, అధికార బీజేపీ దూకుడు పెంచింది. విపక్షాలు లేవనెత్తుతున్న ఆరోపణలను ప్రజల్లో ఎండగట్టడమే కాకుండా, వాటి వెనుక ఉన్న రాజకీయ ప్రయోజనాలను తిప్పికొట్టేందుకు బీజేపీ అధిష్ఠానం కార్యాచరణ ప్రకటించింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ప్రతిఘటన ర్యాలీలు, సభలు నిర్వహించాలని నిర్ణయించింది.బీజేపీ రూపొందించిన దేశవ్యాప్త ఆందోళనల్లో హైదరాబాద్ కూడా భాగం కానుంది. నవంబర్ 2న నగరంలోని చారిత్రక ట్యాంక్ బండ్ పరిసరాల్లో భారీ 'మహా పాదయాత్ర' చేపట్టేందుకు రాష్ట్ర బీజేపీ సన్నాహాలు చేస్తోంది. "లోక్‌తంత్ర బచావో ? అరాచకత హటావో" అనే నినాదంతో సాగే ఈ పాదయాత్రకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా హాజరుకానున్నారు. కేంద్ర నాయకత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో రాష్ట్ర బీజేపీ నాయకత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.కేంద్రంలో అధికారం, సంస్థాగత బలం ఉన్న బీజేపీ.. విపక్షాలు లేవనెత్తే అంశాలను తిప్పికొట్టడంలో అమిత్ షా శైలి భిన్నంగా ఉంటుంది. ప్రత్యర్థులు రాజ్యాంగ సంస్థలపై దాడి చేస్తున్నారని ఆరోపించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థల రక్షణ పేరిట ప్రజల్లో సానుభూతిని కూడగట్టడం బీజేపీ ప్రధాన వ్యూహం. ఈ పాదయాత్ర ద్వారా కాంగ్రెస్, ఇతర మిత్రపక్షాల ఆరోపణలు ఎన్నికల్లో ఓటమి భయంతో చేస్తున్నవేనని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది.ట్యాంక్ బండ్ పరిసరాల్లో జరిగే ఈ మహా పాదయాత్రకు కనీసం లక్ష మంది కార్యకర్తలు, మద్దతుదారులను సమీకరించాలని హైకమాండ్ రాష్ట్ర శాఖకు స్పష్టమైన టార్గెట్ విధించింది. తెలంగాణ రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఈ జన సమీకరణ బీజేపీకి ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ప్రాంతీయంగా తన ఉనికిని బలోపేతం చేసుకోవడానికి బీజేపీకి ఇదొక శక్తివంతమైన వేదిక కానుంది.ఈ భారీ సమీకరణ ద్వారా అటు జాతీయ స్థాయిలో విపక్షాల కూటమికి గట్టి సందేశం పంపడంతో పాటు, ఇటు రాష్ట్ర స్థాయిలో అధికార కాంగ్రెస్‌పై ఒత్తిడి పెంచవచ్చని బీజేపీ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వంటి కీలక ప్రాంతంలో లక్ష మందితో ప్రదర్శన నిర్వహించడం ద్వారా రాజకీయ మైలేజ్ సాధించవచ్చని పార్టీ భావిస్తోంది. ఇందుకోసం గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల శ్రేణులను సమాయత్తం చేసేందుకు కార్యాచరణ మొదలైంది.ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తిపై విపక్షాలు చేస్తున్న ఆందోళనలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి నిరసనలుగా మారుతుండటంతో, బీజేపీ కూడా ధీటుగా బదులిచ్చేందుకే సిద్ధమైంది. విపక్షాల విమర్శలను రక్షణాత్మక ధోరణిలో కాకుండా, దూకుడైన ఎదురుదాడితో ఎదుర్కోవాలన్నదే అమిత్ షా రాక వెనుక ఉన్న అసలు ఉద్దేశం. మొత్తంగా, ఎన్నికల కమిషన్ అంశం చుట్టూ దేశవ్యాప్తంగా మొదలైన ఈ రాజకీయ ఘర్షణ కేవలం ఢిల్లీకే పరిమితం కాకుండా రాష్ట్రాల రాజధానులకు పాకింది

# నడిరోడ్డుపై చైన్ స్నాచర్ల హల్ చల్

**నల్గొండ** గుర్తు తెలియని దుండగులు మహిళపై కట్టర్‌తో దాడి చేసి 3 తులాల పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. కట్టంగూరు మండలం చెరువు అన్నారం స్టేజి వద్ద ఘటన చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై కొడుకుతో కలిసి బైక్‌పై వెళ్తున్న హిమబిందుపై దాడి జరిగింది. నకిరేకల్ నుంచి ఆటిపాముల వైపు వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై హెల్మెట్లు ధరించి ముగ్గురు దుండ గులు వచ్చారు. బాధితురాలి బైక్‌ను ఢీకొట్టి తల్లీకొడుకులను రోడ్డుపై పడేసారు. వెంట తెచ్చుకు న్న కట్టర్‌తో మెడలోని 3 తులాల బంగారు పుస్తెలతాడు కట్ చేసి పరార్ అయ్యారు. ఘటనలో మ హిళ చేతులకుగాయాలుఅయ్యాయి.బాధితురాలు కట్టంగూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

# అస్సాంలో కాల్పుల కలకలం..

**గువహతి** గౌహతిలోని బోరా సర్వీస్ ప్రాంతంలో ఉన్న హోటల్ 'బిలాస్ ఇన్' సమీపంలో కాల్పుల ఘటన చోటు చేసుకుంది. సోమవారం రాత్రి ఒక దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఘటనలో ఇద్దరు మహిళలతో సహా ఐదుగురు మృతి చెందారు. మృతులు హోటల్ యజమాని హెలేనా భారాలి, కుమారుడు దేబార్షి కష్యప్, అతని భార్య, హెలేనా సోదరుడు, డ్రైవర్ నారాయణ్ దాస్‌లుగా గుర్తించారు. హోటల్ బిలాస్ ఇన్ లీజుకి సంబంధించిన విషయంలో చెలరేగిన వివాదమే ఈ కాల్పులకు కారణమని పోలీసులు నిర్ధారించారు. హోటల్ యజమాని వర్గానికి, లీజుకి తీసుకున్న వ్యక్తికి మధ్య గొడవ జరిగిందని సమాచారం. ఈ ఘటనకు పాల్పడిన ఘనకాంత గొగోయ్ అనే నిందితుడ్నిపోలీసులు గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు.

# డివైడర్‌ను ఢీకొట్టిన కారు..మహిళకు గాయలు

**ఎన్టీఆర్** కంచికచర్ల మండలం కీసర బిజెటి స్కూల్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. కైకలూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఏపీ 39 కెఏ 8254 కారు డివైడర్‌ను ఢీకొట్టింది.
ఎదురుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా స్లో అవ్వడంతో బ్రేక్ వేయగా కారు అదుపుతప్పి పల్టీ కొట్టిందని డ్రైవర్ తెలిపాడు. కారులో నలుగురు ఉండగా ఒక మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. కీసర టోల్ అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా ముగ్గురు క్షేమంగా బయటపడ్డారు..

# బిల్లుల కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యే

## అనిరుధ్ రెడ్డి ఆమరణ దీక్ష

**మహబూబ్ నగర్,** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత అసంతృప్తి మరోసారి బహిర్గతమైంది. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల నత్తనడక, పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌పై సొంత పార్టీ శాసనసభ్యులే తిరుగుబాటు బావుటా ఎగరేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, నిలిచిపోయిన పనుల బిల్లుల విడుదల వ్యవహారంలో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజాపూర్ మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటించిన తర్వాత అక్కడి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్ల నిధుల విడుదల కోసం ఏకంగా 30 వేల మంది ప్రజలతో కలిసి అమరణ నిరాహార దీక్షకు దిగడానికి సిద్ధంగా ఉన్నానని హెచ్చరించడం సంచలనం సృష్టించింది.సచివాలయం, ప్రభుత్వ శాఖల పనితీరుపై నిప్పులు చెరిగిన అనిరుధ్ రెడ్డి, నిధుల విడుదలలో తీవ్ర వివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. కేవలం మంత్రుల నియోజకవర్గాలకే ప్రాధాన్యతనిస్తూ బిల్లులు చెల్లిస్తుంటే, మిగిలిన ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని సూటిగా ప్రశ్నించారు. ఇటీవల ఒక కాంట్రాక్టర్ చనిపోతే ఆయనకు రూ.5 కోట్ల బిల్లు మంజూరు చేశారు.. అంటే నా నియోజకవర్గ పనుల కోసం నేను చనిపోతా అంటేనే నిధులు వస్తాయా? నేను చావడానికైనా సిద్ధం అంటూ భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. తన ప్రాణం విలువైందా లేక 40 కోట్ల నిధులు ముఖ్యమా అనేది ప్రభుత్వమే తేల్చుకోవాలని అల్టిమేటం జారీ చేశారు.క్షేత్రస్థాయిలో ప్రజలు రోడ్ల దుస్థితిపై నిలదీస్తుంటే సమాధానం చెప్పలేకపోతున్నామని, మంత్రుల హామీలు నీటిమూటలుగానే మిగిలిపోయాయని ఆయన మండిపడ్డారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలను పలుమార్లు కలిసి వినతులు సమర్పించినప్పటికీ, వారు స్వయంగా నిధుల మంజూరుపై హామీలిచ్చినా నేటికీ పైసా విడుదల కాకపోవడంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే గాంధీభవన్‌ను లేదా ప్రజాక్షేత్రాన్ని వేదికగా చేసుకుని ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.పార్టీ అధికారంలోకి వచ్చి పాలన సాగిస్తున్న వేళ, ప్రతిపక్షాలకు సైతం అవకాశం ఇవ్వకుండా ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యేనే నేరుగా రోడ్డెక్కి ఆమరణ దీక్ష హెచ్చరికలు జారీ చేయడం గాంధీభవన్ వర్గాల్లో కలకలం రేపింది. ఇప్పటికే పెండింగ్ బిల్లుల సమస్యపై పలువురు ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్న తరుణంలో.. అనిరుధ్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు పాలకవర్గాన్ని ఇరుకున పెట్టాయి.

# పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి



**తిరుపతి** భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అయనకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, జేఈవో డా. ఎ. శరత్, ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు స్వాగతం పలికారు.

## మద్యం మత్తులో దాబాలో ప్రభుత్వ ఉద్యోగుల హల్ చల్

**మేడ్చల్** మద్యం మత్తులో ప్రభుత్వ ఉద్యోగులు దాబాలో హల్ చల్ చేసారు. కొంపల్లి ఫ్రెండ్లీ దాబాకు కొంపల్లి సర్కిల్ శానిటేషన్ అధికారులు వెళ్లి మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. దాబాను మూసివేయిస్తామని బెదిరించారు. డీఈఈ తిరుపతి, ఎన్విరాన్‌మెంట్ విభాగం ఇన్‌ఛార్జ్ రాఘవాచారి దాబా యాజమాని కొడుకుపై, సిబ్బందిపై బూతులు తిట్టారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## జనసేన ఎంపీ ఇంటి ముందు పెట్రోల్ క్యానుతో జనసైనికుల ఆందోళన

**పెద్దాపురం** పెద్దాపురం జడ్పీటిసి జనసేన అభ్యర్థి ఎంపిక జనసేన పార్టీలో అగ్గిరాజేసింది. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఇంటి వద్ద పెట్రోల్ క్యాన్ తో జనసేన నాయకులు ఆందోళన కు దిగారు. డబ్బులున్న వ్యక్తులకు తప్పా.. జెండా మోసిన నాయకులకు జనసేనలో విలువ లేదా అంటూ నిలదీసారు. పెద్దాపురం జడ్పీటిసీ జనసేన అభ్యర్థిగా అంబటి శివరాణీకి టిక్కెట్టు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే తొలుత టిక్కెట్టు ఇస్తామని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హమీ ఇవ్వడంతో గుడివాడకు చెందిన అంబటి గంగాధర్ నామినేషన్ వేసారు. ఆఖరి నిముషంలో టికెట్ నిరాకరించడంతో మనస్తాపం చెంది.. తన అనుచరులతో కలిసి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఇంటి ముందు బైఠాయించారు. డబ్బులు ఉన్న వ్యక్తులకు తప్పా...జెండా మోసిన నాయకులకు జనసేనలో విలువ లేదని గంగాధర్ ఆవేదన వ్యక్తం చేసారు.

## ఉస్మానియా ఆసుపత్రిలో జూడాల విధుల బహిష్కరణ

**హైదరాబాద్** ఉస్మానియా ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు విధులను బహిష్కరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం 10 రోజుల గడువు ఇచ్చినా స్పందించలేదని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెండింగ్ బకాయిలు చెల్లించాలని, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ మరోసారి నిరసనకు దిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని జూడాలు కోరుతున్నారు.

## నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించిన బీసీ రాజ్యాధికార యాత్ర

- పడమటిపల్లికి చేరుకున్న తీన్మార్ మల్లన్న పాదయాత్ర
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో యాత్ర పూర్తి..
- తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం పలికిన టీఆర్పీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు



**నల్లగొండ** బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం కల్పించడంతో పాటు రాజ్యాధికారంలో సముచిత వాటా సాధించడమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర మంగళవారం నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాదయాత్రను పూర్తి చేసుకున్న ఆయన, నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పడమటిపల్లి గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం పలికారు. యాత్రలో భాగంగా బీసీల రాజకీయ హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాధికారంలో వారి భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆయన ముందుకు సాగుతున్నారు.బీసీ వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో కొనసాగుతున్న ఈ పాదయాత్రకు వివిధ ప్రాంతాల్లో బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలుపుతున్నారు.పడమటిపల్లి గ్రామం నుంచి దేవరకొండ వైపు బీసీ రాజ్యాధికార యాత్ర కొనసాగనుంది.

## నరసరావుపేటలో గుర్తుతెలియని మృతదేహం కలకలం

**పల్నాడు** నరసరావుపేట పట్టణంలోని అరండల్‌పేట పూజిత హాస్పిటల్ వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం.



నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడి వివరాలు, మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికావాల్సి ఉంది.

## చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- రక్త పరీక్షల కోసం రోగుల అవస్థలు..
- రిపోర్టుల కోసం 24 నుంచి 48 గంటల నిరీక్షణ




**చెన్నూరు:** చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షల కోసం రోగులు పెద్ద ఎత్తున లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ సేకరించిన రక్త నమూనాలను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి పరీక్షలు నిర్వహించాల్సి వస్తోంది. అనంతరం రిపోర్టులు చెన్నూరుకు చేరేందుకు సుమారు 24 గంటల సమయం పడుతోంది. ఒకవేళ ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే రిపోర్టులు అందడానికి 48 గంటల వరకు ఆలస్యం అవుతోంది.డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి, త్వరగా వైద్యం అందించడం ఎంతో ముఖ్యం. అలాంటప్పుడు రిపోర్టుల కోసం ఒకటి, రెండు రోజులు వేచి చూడాల్సి రావడం రోగులకు ఇబ్బందికరంగా మారుతోంది.చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేస్తే రక్త పరీక్షలు స్థానికంగానే నిర్వహించే అవకాశం ఉంటుంది. దీంతో పరీక్షల ఫలితాలు త్వరగా అందడంతో పాటు వైద్యులు సకాలంలో చికిత్స ప్రారంభించేందుకు వీలవుతుంది.కావున గౌరవ మంత్రి వర్యులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## పోకిరిలపై బ్రహ్మాస్త్రం ఫోక్సో చట్టం.... తస్మత్ జాగ్రత్త....

- మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ



**మచిలీపట్నం,అక్టోబర్ 27** 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలను ఏ రకంగా నైనా వేధించే వారిపై కఠినమైన శిక్షలు విధించే బ్రహ్మ అస్త్రం ఫోక్సో చట్టం అని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. నేరం నిరూపణ అయితే ఈ చట్టం ద్వారా కఠిన జైలు శిక్షలు జరిమాన లు ఉన్నాయని, జిల్లా జడ్జి స్థాయి గల న్యాయమూర్తి కేసు విచారణ చేస్తున్నారని, ఈ కోర్టు కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ని కూడా నియమించారని బాలాజీ తెలియజేశారు. వేమూరి వెంకటసుబ్బయ్య కుదరవల్లి సీతారామయ్య మరియు వేమూరి వెంకట రమేష్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నం షార్కి గర్ల్స్ హాస్టల్లోని విద్యార్థినిలకు 40 వేల రూపాయలు ఖరీదు చేసే నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని మరియు నిరుపేదలు ఎక్కువగా ఉన్న గర్ల్స్ హాస్టల్లో వేమూరి చారిటబుల్ ట్రస్ట్ నూతన దుస్తులు అందించడం ద్వారా సేవా పరిధి పెంచుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గర్ల్స్ హైని హాస్టల్లో ఎస్టీ కులానికి చెందిన ఒక విద్యార్థిని అవినిగడ్డ ఫైర్ ఆఫీసర్ సుధాకర్ తన జీతంలో నుంచి డబ్బు ఖర్చు పెట్టి చదివించడం అభినందనీయమని బాలాజీ అన్నారు. ఆడపిల్లలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని బాలాజీ అన్నారు. ఆడపిల్లలు సెల్ ఫోన్ లకు టీవీలకు, అపరిచితులకు దూరంగా ఉండాలని సూచించారు.వేమూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గాంధీ విద్యాలయంలో, మదర్స స్కూల్ లో, షార్కికీ గరల్స్ హాస్టల్లో 40 వేల రూపాయలతో నూతన అందజేస్తామని ట్రస్ట్ చైర్మన్ వేముల రమేష్ తెలియజేశారు తమ ట్రస్టు విద్యార్థులకు ముఖ్యంగా పేద విద్యార్థులకు చదువుకోవడానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతిరోజు దినపత్రిక చదవటం అలవాటు చేసుకోవాలని పుస్తక పట్నం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేమూరి రత్నగిరి, మాజీ కౌన్సిలర్ బొక్క నాంచారయ్య న్యాయవాది మాటూరి రాజేష్,నాగేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ధర్మరాజు, హాస్టల్ వార్డెన్ మణి మార్టిన్, కరస్పాండెంట్ మార్టిన్ లూథర్, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కారులకు సర్టిఫికెట్లను అందించిన పద్మశ్రీ పద్మజారెడ్డి

**హైదరాబాద్** చేనేత కారుల ఉత్పత్తులను ధరించి వారిని ప్రోత్సహించాలని పద్మశ్రీ పద్మజారెడ్డి అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన (షీ-స్టేట్ హ్యాండ్లూమ్ ఎక్స్పో) వస్త్ర ప్రదర్శన ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొని చేనేత కళాకారులకు సత్కరించి సర్టిఫికెట్లను అందజేశారు. ఇలాంటి ప్రభుత్వ ప్రదర్శనలతో చేనేతకారులకు మరింత గుర్తింపు వస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత ఉత్పత్తులను సుమారు 76 స్టాళ్లలో ప్రదర్శించారు. చేనేతకారుల ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించాలనే సదుద్దేశంతో ఈ చేనేత మేళాను ఏర్పాటుచేశామని నిర్వాహకులు తెలిపారు.

## బెడిసికొట్టిన గుప్తనిధుల వేట

**మెదక్** మెదక్ జిల్లా సూరారంలో అర్ధరాత్రి గుప్తనిధుల కోసం చేసిన క్షుద్ర పూజలు కలకలం రేపాయి. కొంతమంది గుప్తనిధుల కోసం క్షుద్ర పూజలు చేస్తున్నారనే విషయం తెలుసుకుని గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. వారంతా ల్దుర్తి మండలం రామాయపల్లి గ్రామ సర్పంచ్ భర్త మహేందర్, కుమారుడు సహా తొమ్మిది మంది ని గుర్తించారు. వారందరికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తొమ్మిది మంది నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసారు.

## దెందులూరులో కూటమి ప్రభంజనం.

- పెదవేగి జెడ్పీటీసీ స్థానం నుంచి చింతమనేని సాయి నవ్యశ్రీ ఏకగ్రీవ ఎన్నిక ఖాయం
- పోటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్న వైసిపి అభ్యర్థి.



పెదవేగి / దెందులూరు: "ఏలూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించింది. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ కుమార్తె, ఉన్నత విద్యావంతురాలు చింతమనేని సాయి నవ్యశ్రీ ప్రత్యక్ష రాజకీయ అరంగేట్రంలోనే అద్భుత విజయాన్ని నమోదు చేశారు. పెదవేగి జెడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆమె ఏకగ్రీవంగా ఎన్నికై సరికొత్త రికార్డు సృష్టించారు. నామినేషన్ వేసిన తొలి రోజు నుంచే కన్నాపురం, రామసింగవరం, కూచింపూడి, న్యాయంపల్లి తదితర గ్రామాల్లో ఆమె చేపట్టిన విస్తృత ప్రచారానికి ప్రజలు, ముఖ్యంగా మహిళా లోకం నీరాజనాలు పలికింది. ప్రతి ఇంటా మంగళహారతులు పడుతూ ప్రజలు చూపించిన అపూర్వ ఆదరణతో నవ్యశ్రీ విజయదుందుభి ఖాయమైంది. చింతమనేని నవ్యశ్రీకి క్షేత్రస్థాయిలో వెల్లువెత్తిన ప్రజాదరణను చూసి ప్రత్యర్థి వర్గంలో తీవ్ర గుబులు మొదలైంది. ఆమె ధాటికి కనీసం పోటీలో నిలబడలేమని భావించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సైతం చివరకు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో పెదవేగి జెడ్పీటీసీ స్థానంలో చింతమనేని నవ్యశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీనిపై ఎన్నికల అధికారులు మరికాసేపట్లో అధికారికంగా ప్రకటన విడుదల చేయనున్నారు. తొలి సమరంలోనే కొండంత ప్రజాభిమానాన్ని సంపాదించుకుని ఏకగ్రీవంగా గెలుపొందడంతో, ఏలూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పీఠం దిశగా నవ్యశ్రీ ప్రస్థానం మరింత బలపడింది. ఈ చారిత్రాత్మక విజయంతో పెదవేగి మండలం సహా దెందులూరు నియోజకవర్గవ్యాప్తంగా కూటమి శ్రేణులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు"..

## అల్లకల్లోలంగా మారిన సముద్రం

**విశాఖపట్నం** ఉత్తరాంధ్రలో అర్నాబ్ అతితీవ్ర తుపాను ప్రభావం చూపుతోంది. సముద్రం 10మీటర్ల ముందుకు చొచ్చుకు వచ్చింది. దాంతో తీరం భారీగా కోతకు గురైపోతుంది. ప్రమాదకరంగా మారడంతో బీచ్ ల్లో పర్యాటకుల ప్రవేశంపై అలధికారులు ఆంక్షలు విధించారు. రుషికొండ బీచ్ మూసివేసారు.మరోవైపు, భీమిలి బీచ్‌లో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి భీమిలి తీరంలో సముద్ర అలలు తీవ్రంగా ఎగసిపడుతున్నాయి. సముద్రం ముందుకు చొచ్చుకొస్తున్నట్లు కనిపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు, పర్యాటకులు బీచ్ సమీపానికి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## బీసీ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలి

- 38 ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియను వేగవంతం చేయాలి
- డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ సిద్ధం చేయాలి
- గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- బీసీ సంక్షేమ శాఖ సమీక్షలో మంత్రి పొన్నంఅధికారులకు ఆదేశాలు జారీ !!!

**హైదరాబాద్** సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించి, శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాలు, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్షించారు. మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకం ద్వారా అర్హులైన విద్యార్థులకు ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా లబ్ధి చేకూర్చాలని ఆదేశించాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకానికి సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాం. డిసెంబర్ 9న కుట్టు మిషన్లు అందించేలా టెండర్ ప్రక్రియతో పాటు ఇతర ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను.రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన పాఠశాలలకు సొంత భవనాలు కల్పించేలా స్థల సేకరణ, నిర్మాణ అనుమతులు, నిధుల మంజూరుపై చర్యలు తీసుకోవాలని సూచించాను. జిల్లా కలెక్టర్లు నెలకు ఒక గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి నివేదికలు అందించాలని ఆదేశించారు. బీసీ స్టడీ సర్కిళ్లలో కమిటీ నివేదిక ఆధారంగా సంస్కరణలు చేపట్టి, నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించాలి. బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించాను.బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ, రజకులకు ఆధునిక ధోబీఘాట్లు, కాటమయ్య రక్షణ కవచాల పంపిణీ, నీరా కేఫ్‌లు, నందనవనాల అభివృద్ధిపై సమీక్షించాను. ఆయా పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు .బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంచడం, గురుకుల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, కమిషనర్ బాలమాయాదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వరి విత్తనాల విక్రయానికి 'సెల్ఫ్ డిక్లరేషన్' తప్పనిసరి అంటూ ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు

- వ్యవసాయ శాఖ స్పష్టీకరణ

**హైదరాబాద్** "వరి సాగు.. బాధ్యత నాదే!" శీర్షికతో 27-10-2026న సాక్షి దినపత్రిక (తెలంగాణ మెయిన్, 3, 7 పేజీలు)లో ప్రచురితమైన వార్త వాస్తవాలకు విరుద్ధంగా, రైతులను అయోమయానికి గురిచేసేలా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ తెలియజేస్తుంది.రైతుల నుంచి 'స్వయం అంగీకార పత్రం' (సెల్ఫ్ డిక్లరేషన్) తీసుకున్న తర్వాతే వరి విత్తనాలు విక్రయించాలని విత్తన డీలర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు వార్తలో పేర్కొనడం పూర్తిగా అవాస్తవమని, ఇలాంటి ఉత్తర్వులు గానీ, సూచనలు గానీ శాఖ జారీ చేయలేదని తెలిపింది. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో, యాసంగిలో నీటి లభ్యత, భూగర్భ జలమట్టాలు, విద్యుత్ డిమాండ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు తక్కువ నీటితో, స్వల్ప కాల పరిమితి గల, పండే ప్రత్యామ్నాయ పంటలను పండించాలని రైతులను కోరుతుంది. రైతులకుఅవసరమైన అన్ని రకాల పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయ పంటల విత్తనాలను సరిపడా అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను వ్యవసాయ శాఖ ఆదేశించింది. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాఖ తెలిపింది. ఎవరైనా డీలర్లు సెల్ఫ్ డిక్లరేషన్ కోసం ఒత్తిడి చేసినా, నాణ్యత లేని విత్తనాలు విక్రయించినా సంబంధిత మండల/జిల్లా వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. అటువంటి డీలర్లపై విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.రైతులు అధికారికంగా వెలువడే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, తప్పుదోవ పట్టించే వార్తలను నమ్మవద్దని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేసింది.

## హైదరాబాద్‌లో మయన్మార్ మహిళపై అఘాయిత్యం

**- స్నేహితులతో కలిసి భర్త గ్యాంగ్ రేప్**



**హైదరాబాద్** హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మయన్మార్‌కు చెందిన మహిళపై ఆమె భర్తతో పాటు మరో ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కంచన్‌బాగ్ పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. మయన్మార్‌కు చెందిన మహిళను బంగ్లాదేశ్‌కు చెందిన ఫయజ్ అనే వ్యక్తి వివాహం చేసుకున్నాడు. అనంతరం వీరిద్దరూ హైదరాబాద్‌కు వచ్చి కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన ఫయజ్.. తన స్నేహితులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవాలంటూ భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలోనే ఆమెపై భర్తతో పాటు మరో ముగ్గురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలు కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్త ఫయజ్‌తో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులంతా బంగ్లాదేశ్‌కు చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మహిళ నుంచి రూ.4.50 లక్షలు వసూలు..

**- ఆపై రిసార్ట్‌కు తీసుకెళ్లి అత్యాచారం**




**ఘట్‌కేసర్** ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ మహిళ నుంచి రూ.4.50 లక్షలు వసూలు చేసి, ఆమెపై అత్యాచారానికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. ఘట్‌కేసర్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మల్లాపూర్‌లోని బ్రహ్మపుత్ర కాలనీలో టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న 30 ఏళ్ల మహిళకు భువనగిరికి చెందిన జగన్మోహన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ మేనేజర్‌గా పనిచేస్తున్నానని, ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఇందుకోసం ఉన్నతాధికారికి డబ్బులు ఇవ్వాలని, మొత్తం రూ.5 లక్షలు ఖర్చవుతాయని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఉద్యోగం వస్తుందనే ఆశతో బాధితురాలు విడతలవారీగా రూ.4.50 లక్షలు నిందితుడికి ఇచ్చినట్లు సమాచారం. అనంతరం ఉద్యోగం ఇప్పించే విషయమై మాట్లాడాలంటూ జగన్మోహన్ బాధితురాలిని కారులో తీసుకెళ్లాడు. మల్లాపూర్ నుంచి భువనగిరికి వెళ్తున్నట్లు చెప్పి, మార్గమధ్యంలో ఘట్‌కేసర్ పరిధిలోని అవుషాపూర్‌లో ఉన్న ఓ రిసార్ట్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ ఉన్నతాధికారి ఉన్నారని మహిళను నమ్మించిన నిందితుడు, అనంతరం ఆమెను బెదిరించి అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అఘాయిత్యం అనంతరం బాధితురాలిని కారులో తీసుకెళ్తున్న జగన్మోహన్.. వరంగల్ జాతీయ రహదారిపై ఆమెను కారు నుంచి కిందకు తోసేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం జగన్మోహన్‌ను అరెస్టు చేశారు.

## ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్..

**- అనుమతి నిరాకరించిన పోలీసులు**

**- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు డిమాండ్‌తో యాత్రకు పిలుపు**

ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రారంభానికి ముందే ఉద్రిక్తతఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే హక్కు ఉందన్న ఈటలగతంలో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారని గుర్తు చేసిన బీజేపీ ఎంపీమల్కాజ్‌గిరి ఎంపీ, భారతీయ జనతా పార్టీ నేత ఈటల రాజేందర్ తలపెట్టిన “మహా పాదయాత్ర”కు పోలీసులు అనుమతి నిరాకరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈరోజు ఉదయం ఈ యాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ నుంచి నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈటల రాజేందర్ ఉదయాన్నే ఏదులాబాద్ చేరుకుని, స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5,000 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. పోలీసుల చర్యపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు తనకుందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి కోరినట్లు వెల్లడించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంటులో మాట్లాడారని ఈటల గుర్తుచేశారు. నాడు రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశంపైనే ఇప్పుడు తాను పాదయాత్ర చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో పాదయాత్ర ముందుకు సాగుతుందా? లేదా? అనే దానిపై అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో ఏదులాబాద్‌లో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

## ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలి

**అమరావతి** అర్నబ్ తుపాను నేపథ్యంలో హోంమంత్రి అనిత అధికారులను అప్రమత్తం చేసారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను పరిస్థితులపై సమీక్షించి కలెక్టర్లకు పలు కీలక ఆదేశాలు జారీ చేసారు. మంత్రి మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి. తుపానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని అన్నారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. బలమైన గాలుల నేపథ్యంలో హోర్డింగ్స్ వెంటనే తొలగించాలి. తుపాను నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను ప్రజలు నమ్మవద్దు. తుపానుపై ప్రభుత్వం జారీ చేసే సూచనలు, ఆదేశాలను ప్రజలంతా తప్పనిసరిగా పాటించాలని అన్నారు.

# కార్తీక మాసానికి శ్రీశైలంలో ఆధ్యాత్మిక శోభ

**పంచమఠాల్లో అభిషేకాలకు భక్తులకు అవకాశం**

**నవంబరు 10 నుంచి డిసెంబరు 9 వరకు కార్తీక మహోత్సవాలు**

**కుమారస్వామి, నందీశ్వరుడు, బయలు వీరభద్రుడికి విశేష పూజలు**





శ్రీశైలం (ప్రశ్న న్యూస్) హరహర మహాదేవ శంభో శంకర నామస్మరణతో మారుమోగే శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక మాస ఆధ్యాత్మిక సందడి మొదలుకానుంది. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా పంచమఠాల్లో ఆర్జిత అభిషేకాలకు అవకాశం కల్పించడంతోపాటు, ఆలయ ప్రాంగణంలోని వివిధ ఉపాలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తోంది. మరోవైపు నిత్యకళారాధనలో సంప్రదాయ నృత్య ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచనున్నాయి.నవంబరు 10 నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధానాలయంలోని గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అయితే భక్తులు పరమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించుకునేందుకు వీలుగా పంచమఠాల్లో ప్రత్యేక అవకాశం కల్పించారు.

### రూ.216తో అభిషేక భాగ్యం..

శ్రీశైల క్షేత్రంలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన పంచమఠాల్లో భక్తులు తమకు నచ్చిన మఠంలో ఆర్జిత అభిషేకం చేయించుకోవచ్చు. ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. సామాన్య భక్తులకు సైతం అభిషేక సేవను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో టికెట్ ధరను కేవలం రూ.216గా నిర్ణయించారు. ఒక టికెట్‌పై దంపతులు లేదా ఒక వ్యక్తికి అభిషేకంలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.టికెట్లను మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009 లేదా ఏపీఆర్టీఎస్ వెబ్‌సైట్ ఊఊఊ.ఎం.ఖఙూ.స్త్రశీఙ.ఱఅ ద్వారా పొందవచ్చు. శతాబ్దాల చరిత్ర కలిగిన పంచమఠాలు ధ్యాన కేంద్రాలుగానే కాకుండా శ్రీశైల ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాయి. గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం వంటి నిర్మాణ లక్షణాలు కలిగిన ఈ మఠాలు భక్తులకు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయి.

### కుమారస్వామికి విశేష అభిషేకం..

లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ మంగళవారం ఆలయ ప్రాంగణంలోని శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి దేవస్థానం విశేష అభిషేకం, పూజలు నిర్వహించింది. ముందుగా దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని అర్చకులు సంకల్పం పఠించారు. అనంతరం మహాగణపతి పూజ నిర్వహించి, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్లు, వివిధ పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకం చేశారు. అర్చనల అనంతరం సుబ్రహ్మణ్య స్తోత్ర పారాయణాలు నిర్వహించారు.

### నందీశ్వరుడికి పంచామృతాభిషేకం..

శ్రీశైల క్షేత్రంలో నందీశ్వరస్వామికి విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రదోషకాల పూజల్లో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ వేదపండితులు సంకల్పం పఠించారు. పంచామృతాలతోపాటు హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నాభిషేకం, నూతన వస్త్ర సమర్పణ, పుష్పార్చన చేసి నానబెట్టిన శనగలను సమర్పించారు. వృషభసూక్తం తదితర వేదమంత్రాల నడుమ జరిగిన ఈ పూజలు క్షేత్రంలో భక్తిభావాన్ని నింపాయి.

### క్షేత్రపాలకుడికి ప్రదోషకాల సేవ

శ్రీశైల క్షేత్రపాలకుడైన బయలు వీరభద్రస్వామికి కూడా విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేసింది. ఆచ్ఛాదన లేకుండా ఆరుబయట దర్శనమిచ్చే స్వామివారు క్షేత్ర రక్షకుడిగా భక్తుల విశ్వాసాన్ని పొందారు. పంచామృతాలు, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించే సంప్రదాయం ఇక్కడ ప్రత్యేకతగా నిలుస్తోంది.

### నిత్యకళారాధనలో నృత్యవైభవం..

ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు ప్రాచీన కళల పరిరక్షణకు శ్రీశైల దేవస్థానం ప్రాధాన్యమిస్తోంది. ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధన వేదికపై హైదరాబాద్‌కు చెందిన నిర్గుణ నృత్యాలయ కళాకారులు సంప్రదాయ నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. వినాయక కౌత్వం, కాలభైరవాష్టకం, భో శంభో, ద్వాదశ జ్యోతిర్లింగాలు, శివాష్టకం తదితర గీతాలు, అష్టకాలతో హర్షిని, రిషిక, శ్రీయ, భవ్య తదితరులు నృత్యాభినయం చేయనున్నారు.

హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యాలు, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్రమాలతో నిత్యకళారాధన భక్తులకు ఆధ్యాత్మిక వినోదాన్ని అందిస్తోంది. స్వామి అమ్మవార్ల కైంకర్యాలు నిర్విఘ్నంగా జరగాలని, భారతీయ సంప్రదాయ కళలు తరతరాలకు అందాలని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు శ్రీశైల క్షేత్రానికి మరింత ఆధ్యాత్మిక వైభవాన్ని తీసుకొస్తున్నాయి.

# అర్ధరాత్రి తుపాను ముప్పు.. తీరంలో హై అలర్ట్

**- తెల్లవారుజామున 2-4 గంటల మధ్య అర్నబ్ తీరం దాటే అవకాశం**

**ఏలేరు నుంచి 5 వేల క్యూసెక్కుల నీటి విడుదల**








కాకినాడ (ప్రశ్న న్యూస్): ఒకవైపు అతి తీవ్ర తుపాను అర్నబ్.. మరోవైపు ఎడతెరిపిలేని వర్షాలు, బలమైన ఈదురుగాలులు.. ఇంకోవైపు సముద్రపు అలల ఉధృతి! తీర ప్రాంతాల్లో ప్రమాద సూచనలు పెరుగుతున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజల ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలకు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. తీర గ్రామాల ప్రజలను గుర్తించి సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలని, రాత్రివేళ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.మంగళవారం రాత్రి కలెక్టరేట్ నుంచి జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్.. తుపాను పరిస్థితులు, వర్షపాతం, తీర ప్రాంతాల్లో సముద్రపు అలల ఉధృతి, సహాయక చర్యలపై సమీక్షించారు. రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు.

### కాకినాడకు 90 కి.మీ. దూరంలో తుపాను..

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మంగళవారం రాత్రి 8.30 గంటలకు విడుదల చేసిన సమాచారం ప్రకారం, అర్నబ్ తుపాను గత ఆరు గంటల్లో గంటకు 18 కిలోమీటర్ల వేగంతో కదిలింది. విశాఖపట్నానికి 170 కి.మీ., కాకినాడకు 90 కి.మీ., మచిలీపట్నానికి 170 కి.మీ., బాపట్లకు 240 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైనట్లు అధికారులు తెలిపారు. తుపాను బాహ్య వలయం భూభాగాన్ని తాకుతున్నట్లు, తెల్లవారుజామున 2 నుంచి 4 గంటల మధ్య పూర్తిగా తీరం దాటే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. దీని ప్రభావంతో బుధవారం ఉదయం వరకు పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 28 ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు, 133 ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదైనట్లు సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు.

### ఉప్పాడ నుంచి తుని వరకు అప్రమత్తం..

ఉప్పాడ తీర ప్రాంతం నుంచి కాకినాడ రూరల్ మీదుగా తుని వరకు సముద్రపు అలల ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తీరానికి సమీపంలోని గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సముద్ర తీరానికి నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో పూరిగుడిసెలు, దెబ్బతిన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని కూడా గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాత్రివేళ సముద్రపు నీటి మట్టం పెరిగితే సహాయక చర్యలకు ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. మండల రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైన వారిని ఆలస్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని స్థానికంగా సమాచారాన్ని చేరవేయాలని సూచించారు.

# చామంతి పూలతో లాభాల బాట..

**నిజామాబాద్** : మారుతున్న కాలానికి అనుగుణంగా, సంప్రదాయ పంటల సాగుతో నష్టాలను చవిచూస్తున్న రైతులు ప్రత్యామ్నాయ, లాభసాటి పంటల వైపు మళ్లుతున్నారు. ఈ కోవలోనే అనంతపురం జిల్లా నార్పల మండలం వెంకటాం గ్రామానికి చెందిన రైతు రఫీ చామంతి పూల సాగులో అనూహ్య విజయం సాధిస్తున్నారు. మార్కెట్ అవసరాలను, పండగల డిమాండ్‌ను అర్థం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. రైతు రఫీ తనకున్న ఆరు ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని రెండు ఎకరాల చొప్పున మూడు భాగాలుగా విభజించారు.

ప్రతి విభాగంలో విడతల వారీగా వివిధ రకాల చామంతి పూలను నాటారు. సాధారణంగా చామంతి సాగును జూన్-జులై నెలల్లో ప్రారంభిస్తారు. దీనివల్ల శీతాకాలంలో, కార్తీక మాసం, పెళ్లిళ్ల సీజన్‌లో అధిక దిగుబడులు వస్తాయి. అయితే రఫీ దసరా, దీపావళి, సంక్రాంతి వంటి ప్రధాన పండగల సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని ముందుగానే మొక్కలు నాటారు. దీనివల్ల పండగల సమయంలో పూలకు అధిక గిరాకీ, మంచి ధర లభిస్తున్నాయి.ప్రస్తుతం ఆయన పొలంలో బుల్లెట్ (తెలుపు, పసుపు రకాలు), ఐశ్వర్య, ముస్కిన్ వైట్, పేపర్ ఎల్లో, పేపర్ వైట్, పూర్ణిమా ఎల్లో, పూర్ణిమా వైట్ వంటి వివిధ రకాల చామంతులు సాగవుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుండి ఒక్కో మొక్కను రూ. 1.50 చొప్పున కొనుగోలు చేసి, రవాణా, నాటడానికి కలిపి రూ. 2 ఖర్చు అయ్యిందని రఫీ తెలిపారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు కూలీలను పెట్టి మొక్కలను నాటించారు. మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు దూరం ఉండేలా జాగ్రత్త పడ్డారు. మొక్కలు నాటిన ఐదు నెలలకు దిగుబడి ప్రారంభమవుతుంది. సాగులో భాగంగా ఎరువులు, పురుగుమందుల వాడకంలో రఫీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మొదట డీఏపీ, ఆ తర్వాత ట్రిపుల్ 8, ట్రిపుల్ 28 వంటి ఎరువులను ఉపయోగిస్తారు. డ్రిప్ ద్వారా 13-45-13, 12-0-61 వంటి వాటిని అందిస్తూ, మధ్యమధ్యలో న్యూట్రియెంట్స్, ఫార్ములా 6, హ్యూమిక్ పౌడర్ వంటి వాటిని కూడా వాడుతున్నారు.

చామంతి పూలకు సాధారణంగా మొగ్గ వచ్చే వరకు తెగుళ్లు పెద్దగా రావు, కానీ మొగ్గ వచ్చిన తర్వాత పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి నివారణకు అవసరమైన మందులను వాడుతున్నామని రఫీ వివరించారు.చామంతి పూల కోత సుమారు రెండు నెలల పాటు నిరంతరం కొనసాగుతుంది, ఆ తర్వాత మూడో నెలలో దిగుబడి కాస్త తగ్గుతుంది. మొదటి కోతలోనే రెండు ఎకరాల నుంచి ఒక టన్ను పూలు వచ్చాయని, కిలో రూ. 200 చొప్పున రూ. 2 లక్షల ఆదాయం వచ్చిందని రఫీ తెలిపారు. మొత్తం పెట్టుబడి మొక్కలు నాటినప్పటి నుంచి రూ. 2.25 లక్షలు అయ్యిందని, మొదటి కోతతో పెట్టుబడి వెనక్కి వచ్చి, రెండో కోత నుంచి లాభాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఒకే రోజు పరీక్షలా...

**హైదరాబాద్ :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో రోడ్లు మరియు భవనాల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్షల తేదీలు, అలాగే స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే జూనియర్ ఇంజనీర్ పరీక్షల తేదీలు ఒకే రోజు రావడంతో అభ్యర్థుల నుంచి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. నవంబర్ 6, 7 తేదీల్లో జరగాల్సిన టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష తేదీలు, నవంబర్ 2 నుంచి 6 వరకు షెడ్యూల్ చేయబడిన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీలతో క్లాష్ అవుతున్నట్లు అభ్యర్థులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం, ఎస్సెస్సీ ఛైర్మన్‌తో స్వయంగా మాట్లాడి అభ్యర్థుల ఇబ్బందిని పరిష్కరించేందుకు చొరవ చూపారు.ఈ పరీక్షల క్లాష్‌ను పరిష్కరించే క్రమంలో, ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ పరీక్ష తేదీ నవంబర్ 6, 2026గా కేటాయించబడి, టీజీపీఎస్సీ ఏఈ పరీక్ష కూడా అదే రోజు రావడం వల్ల నష్టపోతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. నవంబర్ 6వ తేదీన ఎస్సెస్సీ జూనియర్ ఇంజనీర్ (సివిల్) పరీక్షను కలిగి ఉండి, టీజీపీఎస్సీ ఏఈ (సివిల్) పరీక్షకు కూడా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కొన్ని నిర్దిష్ట పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

## తిరువూరులో కూటమి జైత్రయాత్రకు చిన్ని వ్యూహం

**28 వార్డుల్లో సుడిగాలి,ప్రత్యర్థులకు సవాల్**

**రూపురేఖలు మారుస్తామంటున్న ఎంపీ..**



తిరువూరు(ప్రశ్న న్యూస్) ఒకే రోజు.. 28 వార్డులు.. కూటమి గెలుపే లక్ష్యం! తిరువూరు మున్సిపల్ ఎన్నికల బరిలో విజయమే ధ్యేయంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రచార హోరు పెంచారు. వార్డువార్డునా పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రజల్లోకి వెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి పి. మాధవితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుసుకున్నారు. తిరువూరులో కూటమి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు పట్టణ అభివృద్ధికి భారీ ప్రణాళికలను ప్రకటించి ఎన్నికల ప్రచారంలో అభివృద్ధి అజెండాను తెరపైకి తెచ్చారు.

### ఐక్యతే ఆయుధం.. గెలుపే లక్ష్యం..

తిరువూరు బైపాస్ రోడ్డులోని వినాయకుడి ఆలయంలో ప్రత్యేక పూజలతో ఎంపీ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అనంతరం బైపాస్ రోడ్డు, రేపూడి బజార్, మధిర రోడ్డు మీదుగా రోడ్‌షో నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. పలుచోట్ల మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. స్థానిక సమస్యలను ప్రజలు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.
తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం వంటి సమస్యలపై వినతులు అందించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు.మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో సీట్ల సర్దుబాటు ప్రశాంతంగా పూర్తయిందని, మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని కేశినేని చిన్ని తెలిపారు. జనసేనకు చెందిన పి. మాధవిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపిక చేయడం కూటమి ఐక్యతకు నిదర్శనమన్నారు. సీట్ల సర్దుబాటులో త్యాగాలు చేసిన నాయకులు, ఆశావహులకు భవిష్యత్తులో తగిన గుర్తింపు ఇస్తామని పేర్కొన్నారు.ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ముందుకు సాగుతోందని చెప్పారు. గత ఎన్నికల్లో నియోజకవర్గంలో సాధించిన మెజారిటీని మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## విద్యారణ్య స్కూల్ నిర్వాహకుడి పై కేసు నమోదు

**“అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహణ, విలేకరి పై తప్పుడు ఫిర్యాదు చేశారంటూ ఆరోపణలు కోర్టు ఆదేశాలతో ఐదు సెక్షన్ల కింద కేసు.. దర్యాప్తు ప్రారంభం”**


సిరిపురం ఉపేందర్

హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్)పాఠశాల నిర్వహణకు అవసరమైన అనుమతులు లేవని ప్రశ్నించినందుకు విలేకరిపై తప్పుడు ఫిర్యాదు చేయడంతోపాటు, ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వార్త ప్రచురింపజేశారనే ఆరోపణల పై విద్యారణ్య స్కూల్ నిర్వాహకుడి పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడిగా పేర్కొన్న ప్రజా ప్రశ్న న్యూస్ విలేకరి ఓ. సంతోష్ రాజు దాఖలు చేసిన ఫిర్యాదు పై నాంపల్లిలోని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాల మేరకు అంబర్‌పేట పోలీసులు ఈ చర్యలు చేపట్టారు.ఫిర్యాదు వివరాల ప్రకారం అంబర్‌పేటలోని పటేల్‌నగర్, రామంతాపూర్‌లోని వివేక్‌నగర్ ప్రాంతాల్లో సిరిపురం ఉపేందర్ అనే వ్యక్తి విద్యారణ్య స్కూల్‌ను నిర్వహిస్తున్నారని సంతోష్ రాజు ఆరోపించారు. పాఠశాలకు అవసరమైన గుర్తింపు, అనుబంధ గుర్తింపు, సంబంధిత అనుమతులు, విద్యాశాఖ అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) లేకుండానే విద్యాసంస్థను నిర్వహిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని నిర్ధారించుకునేందుకు అంబర్‌పేట, ఉప్పల్ మండల విద్యాధికారులను సంప్రదించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ క్రమంలో తనపై కక్ష పెంచుకున్న పాఠశాల నిర్వాహకుడు తనను బెదిరించి వేధించాలనే ఉద్దేశంతో అక్రమ ప్రవేశం, డబ్బుల వసూలు ఆరోపణలతో తప్పుడు ఫిర్యాదు చేశారని విలేకరి ఆరోపించారు. అంతేకాకుండా, ‘టుడేస్ న్యూస్’ అనే స్థానిక పత్రికలో తనపై అసత్య, తప్పుదోవ పట్టించే ఆరోపణలతో వార్త ప్రచురింపజేసి సమాజంలో తన ప్రతిష్ఠను దెబ్బతీశారని పేర్కొన్నారు. ఆ పత్రికకు భారత వార్తాపత్రికల రిజిస్ట్రార్ (ఆర్ఎన్ఐ) జారీ చేసే చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ నంబర్ కూడా లేదని ఫిర్యాదులో ఆరోపించారు.పాఠశాలకు అవసరమైన అనుమతులు లేకుండా నిర్వహించడం, తప్పుడు సమాచారంతో ఫీజులు వసూలు చేయడం, తనపై తప్పుడు ఫిర్యాదు చేయడం, పరువుకు భంగం కలిగించే వార్తలు ప్రచురించడం వంటి చర్యల ద్వారా తనను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేయడంతో పాటు, పాఠశాల నిర్వహణ పై ప్రశ్నించకుండా అడ్డుకోవాలని ప్రయత్నించారని సంతోష్ రాజు ఆరోపించారు.ఈ వ్యవహారంపై అంబర్‌పేట పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని, ఆయన కోర్టును ఆశ్రయించారు.దీంతో కోర్టు ఆదేశాల మేరకు అంబర్‌పేట పోలీసులు క్రైమ్ నంబర్ 569/2026గా కేసు నమోదు చేశారు.

## రుణపరిమితి పెంచడం సాధ్యమేనా

**హైదరాబాద్ :** తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్‌నినో రూపంలో ఊహించని ప్రకృతి, పరిపాలనా సవాళ్లు ఎదురవుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి నిల్వలు క్షీణించి భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోవడంతో, క్షేత్రస్థాయిలో వ్యవసాయం దెబ్బతింటోంది. మరోవైపు సాగునీటి పంపింగ్ కోసం వ్యవసాయ విద్యుత్ వినియోగంతో పాటు పగటి ఉష్ణోగ్రతల వల్ల గృహ వినియోగం అనూహ్యంగా పెరిగింది. రైతులకు రెండో పంట వేసుకునే అవకాశం తగ్గడం వల్ల పంటల నష్టం వేల కోట్లకు చేరే ప్రమాదం పొంచి ఉంది. ఇటు విద్యుత్ కొనుగోళ్లకు అదనపు భారం పడటం, అటు నష్టపోతున్న వర్గాలను ఆదుకునేందుకు ఇందిరమ్మ కిట్ వంటి సంక్షేమ పథకాలు అమల్లోకి తెస్తుండటంతో ప్రభుత్వ ఖజానాపై ఊహించని భారం పడుతోంది.ఈ అదనపు ఖర్చులను తట్టుకునేందుకు మరియు హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగించేందుకు నిధులు అత్యవసరంగా మారాయి. అయితే, రాష్ట్ర సొంత ఆదాయం సరిపోకపోవడంతో మార్కెట్ రుణాల ద్వారా నిధులను సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం విధించే ఎఫ్ఆర్‌బీఎమ్ రుణ పరిమితిని పెంపుదల చేయాలని తెలంగాణ సర్కార్ కేంద్రాన్ని కోరేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం జీఎస్‌డీపీలో 3 శాతంగా ఉన్న రుణ పరిమితిని కనీసం 4 నుంచి 4.5 శాతానికి పెంపు చేయాలని విజ్ఞప్తి చేస్తోందిగతం నుంచి వస్తున్న అనుభవాలు, ఆర్థిక నియమావళి భిన్నమైన సంకేతాలను ఇస్తున్నాయి. సాధారణంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కఠినమైన ద్రవ్య లోటు లక్ష్యాలను అనుసరిస్తుంది. గతంలో కోవిడ్ మహమ్మారి లేదా తీవ్రమైన జాతీయ విపత్తుల సమయంలో మాత్రమే అన్ని రాష్ట్రాలకు సడలింపులు ఇచ్చింది.
ఎల్‌నినో వల్ల కేవలం తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభావం ఉంటుంది కాబట్టి, ఒకే రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎఫ్ఆర్‌బీఎమ్ పరిమితి పెంచడం కేంద్రానికి నిబంధనల రీత్యా సులభం కాకపోవచ్చు. కేంద్రం రుణ పరిమితి పెంచాలంటే కొన్ని షరతులు విధించే అవకాశం ఉంది. ఉదాహరణకు, గతంలో విద్యుత్ రంగ సంస్కరణలు అమలు చేయడం , పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తి పన్ను సంస్కరణలు చేపట్టడం వంటి నిబంధనలు తీర్చినప్పుడే అదనంగా 0.5% బిజినెస్ రారో ఆప్షన్ ఇచ్చేవారు. రేవంత్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ విధానానికి కట్టుబడి ఉన్నందున, కేంద్రం విధించే విద్యుత్ సంస్కరణలకు అంగీకరించడం రాజకీయంగా పెద్ద సవాలుగా మారుతుంది.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలో ప్రతిపక్ష హోదాలో తీవ్ర పోటీనిస్తోంది.

# పిల్లల భద్రతే సమాజ బాధ్యత!

**- లైంగిక నేరాలపై అవగాహన.. పోక్సో చట్టంపై పాఠశాలల్లో ప్రచారం**

**- అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. వేధింపులు ఎదురైతే వెంటనే పెద్దలకు చెప్పాలి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) పిల్లలపై లైంగిక నేరాలను అరికట్టడం, వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం, తమ హక్కులపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ‘సురక్షిత్ బచ్పన్ అభియాన్’ కార్యక్రమంలో భాగంగా లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం--2012 (పోక్సో)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.
జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పిల్లల భద్రత, వ్యక్తిగత రక్షణ, సురక్షిత ఇంటర్నెట్ వినియోగం, లైంగిక వేధింపులను గుర్తించడం, వాటిపై స్పందించడం వంటి అంశాలను వివరించారు.

### బోడుప్పల్‌లో 250 మంది విద్యార్థులకు అవగాహన

బోడుప్పల్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి. బాల భాస్కర్ రావు, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.ఎస్.ఎల్. ప్రియాంక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ ఇంటర్నెట్ విద్య, సమాచారం, వినోదానికి ఉపయోగపడుతుందని, అయితే దాని వినియోగంలో పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో పంచుకోవద్దని, ఆన్‌లైన్‌లో వచ్చే అనుమానాస్పద సందేశాలు, పరిచయాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### కాప్రాలో పోక్సో చట్టంపై అవగాహన

కాప్రాలోని జెడ్పీహెచ్ఎస్‌లో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. అమరావతి విద్యార్థులకు పోక్సో చట్టంలోని ముఖ్యమైన అంశాలు, లైంగిక నేరాలకు సంబంధించిన శిక్షలు, పిల్లల హక్కుల గురించి వివరించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఇబ్బందులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు వెంటనే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### నేరేడ్మెట్‌లో పిల్లలకు అనుకూలమైన న్యాయ సహాయంపై దృష్టి

నేరేడ్మెట్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో పోక్సో కేసులు, అత్యాచార కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి చిట్టిబొమ్మ ఆశాలత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. లైంగిక నేరాలకు గురైన పిల్లలకు గౌరవప్రదమైన, సున్నితమైన వాతావరణంలో న్యాయ సహాయం అందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. బాధిత పిల్లలు భయపడకుండా తమ సమస్యలను వెల్లడించేలా వారికి భరోసా కల్పించాలని, వారి గౌరవం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### పీర్జాదిగూడలో పాఠశాల భద్రతా చర్యలపై చర్చ

పీర్జాదిగూడలోని గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.ఎస్.ఎల్. ప్రియాంక పాఠశాల పోక్సో కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. పిల్లల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలు, పాఠశాలల్లో సురక్షిత వాతావరణం కల్పించడం, అనుమానాస్పద ఘటనలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉప్పల్, నాగారంలోనూ అవగాహన కార్యక్రమాలు

ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పిల్లలపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, ఇబ్బందులకు గురిచేసినా మౌనంగా ఉండకూడదని సూచించారు. నమ్మకమైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా ఇతర పెద్దలకు వెంటనే విషయం తెలియజేయాలని, పిల్లల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వివరించారు.నాగరంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మొదటి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ లాడే రాజు పిల్లల రక్షణ, వ్యక్తిగత భద్రత, లైంగిక నేరాల నివారణపై అవగాహన కల్పించారు.

### పిల్లల రక్షణకు సమష్టి బాధ్యత

పిల్లలపై లైంగిక నేరాలను నివారించడంలో చట్టాలపై అవగాహనతో పాటు కుటుంబం, పాఠశాల, సమాజం సమష్టిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ కార్యక్రమాలు చాటిచెప్పాయి. పిల్లలు తమకు ఎదురయ్యే ఇబ్బందులను నిర్భయంగా చెప్పగలిగే వాతావరణాన్ని కల్పించాలని, వారి మాటలను శ్రద్ధగా వినాలని, సమస్యను తేలికగా తీసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో న్యాయమూర్తులతో పాటు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్, కోర్టు సిబ్బంది, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత.. వారి బాల్యాన్ని కాపాడటం సమాజ కర్తవ్యం అనే సందేశంతో అవగాహన కార్యక్రమాలు కొనసాగాయి.

# తుపాను ముప్పు.. అప్రమత్తంప్రాణనష్టం జరగొద్దు

**- ప్రజలను వెంటనే తరలించండి..**

**‘అర్నబ్’పై పవన్ కళ్యాణ్ హైఅలర్ట్..**

**92 ఆవాసాలపై ప్రత్యేక దృష్టి..**

**- 15 వేల మందికి పునరావాస ఏర్పాట్లు..**

**- 140 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం..**

**ఏలేరు వరదపై నిరంతర నిఘా**



కాకినాడ(ప్రశ్న న్యూస్) తుపాను ముప్పు ముంచుకొస్తోంది! తీరం దాటే సమయంలో పెనుగాలులు, కుంభవృష్టి, సముద్రపు అలల ఉద్ధృతి తీరప్రాంత ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా యంత్రాంగం అప్రమత్తం కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఒక్క ప్రాణం కూడా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని, తీర ప్రాంతాలు, లోతట్టు ఆవాసాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో సహాయక చర్యలపై దిశానిర్దేశం చేశారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబరు 28 మధ్యాహ్నానికి యానాం సమీపంలో తుపాను తీరం దాటే అవకాశం ఉందని అధికారులు వివరించారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చని తెలిపారు. కాకినాడ, యానాం తీర ప్రాంతాల్లో ఒకటి నుంచి రెండు మీటర్ల ఎత్తులో సముద్రపు అలలు ఎగసిపడే ప్రమాదం ఉందని, అక్టోబరు 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

### 92 ఆవాసాలపై ప్రత్యేక దృష్టి..

తుపాను ప్రభావం అధికంగా ఉండే తాళ్లరేవు, యు.కొత్తపల్లి, కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, కరప, తొండంగి మండలాల్లో ముందస్తు చర్యలను ముమ్మరం చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఆరు తీర ప్రాంత మండలాల్లో గుర్తించిన 50 గ్రామాలు, లోతట్టు ప్రాంతాల్లోని మొత్తం 92 ఆవాసాల నుంచి ప్రజలను తరలించేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు.సుమారు 15 వేల మందికి పైగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రంలోపే తరలింపు పూర్తి చేయాలని, సముద్ర తీరానికి మూడు నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలోని పూరిళ్లు, రేకుల ఇళ్లు, శిథిలావస్థలోని భవనాల్లో నివసించేవారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. హోప్ ఐలాండ్‌లోని 40 మత్స్యకార కుటుంబాలను ఇప్పటికే పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు.

### పునరావాస కేంద్రాల్లో వసతులు కరువు కాకూడదు..

తుపాను బాధితులకు ఆశ్రయం కల్పించేందుకు జిల్లాలో 50,700 మందికి సరిపడా సామర్థ్యంతో 101 తుపాను రక్షణ కేంద్రాలు, పాఠశాలలు, ఇతర భవనాలను గుర్తించినట్లు కలెక్టర్ వివరించారు. అదనంగా 114 సహాయక కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు.
పునరావాస కేంద్రాల్లో తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం, విద్యుత్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, దుప్పట్లు, చిన్నారులకు పాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని పవన్ కళ్యాణ్ సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, చిన్నారులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 13,921 మంది వృద్ధులు, 9,542 మంది చిన్నారులు, 1,126 మంది గర్భిణులు, 1,226 మంది దివ్యాంగులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఇందుకోసం ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

### 24 గంటలూ కంట్రోల్ రూమ్ పనిచేయాలి

జిల్లా కలెక్టరేట్‌తోపాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. గ్రామస్థాయి నుంచి అందే సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన చోట్ల సహాయక బృందాలను తక్షణమే పంపాలని ఆదేశించారు.

# అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ‘పక్కా’ ప్రణాళిక

**తిరుచానూరులో టీటీడీ యంత్రాంగం పరుగులు**

**పంచమి తీర్థానికి ప్రత్యేక ఏర్పాట్లు**

**క్యూలైన్లు, పార్కింగ్, అన్నప్రసాదంపై జేఈవో ఎ. శరత్ దృష్టి**



తిరుచానూరు (ప్రశ్న న్యూస్) తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు టీటీడీ కసరత్తు ముమ్మరం చేసింది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, పార్కింగ్, అన్నప్రసాదం, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలని టీటీడీ జేఈవో డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు.డిసెంబరు 5న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా, డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు ప్రధాన ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తిరుచానూరులోని అమ్మవారి ఆలయం, వాహన మండపం, నాలుగు మాడ వీధులు, పార్కింగ్ ప్రాంతాలు, క్యూలైన్లు, పుష్కరిణి, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను జేఈవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### రద్దీకి ముందే అప్రమత్తం..

బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు హోల్డింగ్ పాయింట్లు, క్యూలైన్లను పద్ధతిగా ఏర్పాటు చేయాలని జేఈవో ఆదేశించారు. అన్నప్రసాదం, లడ్డూ పంపిణీ, టికెట్ కౌంటర్ల వద్ద భక్తులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా గరుడ వాహనం, గజ వాహనం, పంచమి తీర్థం రోజుల్లో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

### విద్యుత్ వెలుగుల్లో ఉత్సవ వైభవం..

అమ్మవారి ఆలయం, వాహన మండపం, మాడ వీధులను విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

విజిలెన్స్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ విభాగాలు, ఆలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వారంలోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఉత్సవాల నిర్వహణలో భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రథమ ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు.



# వెంకటేశ్ సినిమాకు గుడ్ న్యూస్..

## టికెట్ ధరల పెంపుకు ఏపీ సర్కార్ గ్రీన్ సిగ్నల్

విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన 'ఆదర్శ కుటుంబం హౌఖ47' సినిమాకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు, రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సినిమా విడుదలకు రెండు రోజుల ముందే ఈ అనుమతి లభించడంతో చిత్ర బృందానికి పెద్ద ఊరట లభించింది. తాజా ఉత్తర్వుల ప్రకారం... రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్స్‌లలో ఒక్కో టికెట్‌పై రూ.75, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.50 వరకు అదనంగా వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. చిత్ర నిర్మాత ఎస్. రాధాకృష్ణ (హారికా అండ్ హాసిని క్రియేషన్స్) చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు. టికెట్ ధరల పెంపునకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, లైసెన్సింగ్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్, ఫ్యామిలీ డ్రామాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. గతంలో వెంకటేశ్ హీరోగా, త్రివిక్రమ్ రచయితగా 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో వస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రష్మిక పాత్ర కోసం వెళ్లి సీతగా.. 'సీతారామం' చిత్రంలో మృణాల్ ఠాకూర్ ఎంపిక వెనుక అసలు కథ ఇదే.!



యువ నటి మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో టాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'సీతారామం' ఎంతటి మైలురాయిగా నిలిచిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఈ చిత్రంలో ఆమెను మొదట 'అఫ్రీన్' పాత్ర కోసమే సంప్రదించారట. కానీ కథ చెప్పే క్రమంలో దర్శకుడు హను రాఘవపూడి ఆమెను చూసి మనసు మార్చుకుని, ఏకంగా 'సీత మహాలక్ష్మి' ప్రధాన పాత్రకు ఎంపిక చేయడం విశేషం. దర్శకుడు హను రాఘవపూడి దాదాపు ఐదు గంటల పాటు ఎంతో ఓపికగా, భావోద్వేగాలతో ఈ కథను తనకు వినిపించారని, ఆ నెరేషన్ తనను ఎంతగానో కదిలించిందని మృణాల్ పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారు. నాగ్ అశ్విన్ ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ బ్యూటీ, సీత పాత్రలో ఒదిగిపోయి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆ పాత్రలోని స్వచ్ఛత, అంకితభావం ఈ సినిమాను టాలీవుడ్‌లో ఒక కల్ట్ క్లాసిక్‌గా నిలబెట్టాయి.

# అయ్యప్పపై 'మాలికాపూరం' దర్శకుడి కొత్త చిత్రం..

## – 'మణికంఠ' ఫస్ట్ లుక్ విడుదల

మలయాళంలో సంచలన విజయం సాధించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'మాలికాపూరం' దర్శకుడు విష్ణు శశి శంకర్ నుంచి మరో ఆధ్యాత్మిక చిత్రం రాబోతోంది. తంత్రా ఫిలిమ్స్‌పతాకంపై తెరకెక్కుతున్న తాజా చిత్రం 'మణికంఠ' అయ్యప్ప స్వామి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. '(అయ్యప్ప దర్శనానికి సిద్ధం కండి) అంటూ సాగిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో వైభవ్ టైటిల్ రోల్‌లో నటించబోతుండగా, మీనాక్షి గోవిందరాజన్ , అరవింద్ ఆకాష్ జె.కె. శరవణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్ గి అమరన్ సంగీతం అందిస్తుండగా, సూర్య రాజీవన్, శతశ్ కుమార్ తదితరులు ఇతర సాంకేతిక విభాగాల్లో పని చేస్తున్నారు. అయ్యప్ప భక్తులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకునేలా రూపొందుతున్న ఈ 'మణికంఠ' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలువడనున్నాయి.




## త్రివిక్రమ్ రైటింగ్
# మ్యాజిక్ చేస్తుంది



'ఈ ఆఫర్ నా వద్దకొచ్చినప్పుడే.. ఇందులో నాది అమ్మ పాత్ర అని చెప్పారు. అయినప్పటికీ 'నో' చెప్పాలనే ఆలోచన నాకు కలుగలేదు. అసలు వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్ సినిమాలో నటించడమే అదృష్టం. పైగా కథ విన్నాక.. ఇలాంటి సినిమాలు, పాత్రలు అరుదుగా వస్తాయి అనిపించింది. అందుకే ఆలోచించకుండా 'ఎస్' చెప్పేశా' అని కథానాయిక శ్రీనిధిశెట్టి అన్నారు. వెంకటేశ్‌కి జోడీగా ఆమె నటించిన ఫ్యామిలీ థ్రిల్లర్ 'ఆదర్శకుటుంబం –హౌస్ నెం.47'. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎస్.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానున్నది. సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో శ్రీనిధిశెట్టి మాట్లాడారు. 'త్రివిక్రమ్ డైరెక్షన్‌లో సినిమా చేయడం నా డ్రీమ్. అలాంటిది ఆయన నుంచి కాల్ రావడంతో నా ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఇది క్రైమ్ కామెడీ మూవీ. నేను తొలిసారి కామెడీ చేశాను. చిట్‌ఫండ్‌లో డబ్బు పోగొట్టి, ఊరంతా అప్పులు చేస్తాను. నా కెరీర్‌లో ఇలాంటి పాత్ర చేయడం ఇదే ప్రథమం. వెంకటేశ్ గొప్ప నటుడు. ఆయన కామెడీ టైమింగ్, ఎమోషన్స్‌నీ మ్యాచ్ చేయడం కష్టం. త్రివిక్రమ్ సూచనలతో కామెడీని సహజంగా చేసేందుకు ట్రై చేశా. త్రివిక్రమ్ డైలాగ్స్‌లో చక్కని భావం ఉంటుంది. దాన్ని అర్థం చేసుకొని నటించాను. ఈ సినిమాలో త్రివిక్రమ్ రైటింగ్ మ్యాజిక్ చేస్తుంది. 'చచ్చే సైన్యం లేకుండా గెలిచే యుద్ధం ఏది సార్?' అనే డైలాగ్ నాతో పాటు అందరికీ నచ్చింది' అంటూ పేర్కొన్నది శ్రీనిధిశెట్టి. ఇటీవలే సినిమా చూశానని, అద్భుతం అనిపించిందని ఈ సినిమాలో కామెడీ ఎంత ఎంజాయ్ చేస్తారో, యాక్షన్‌ని కూడా అంతే ఎంజాయ్ చేస్తారని శ్రీనిధి తెలిపింది.

# యశ్‌రాజ్ ఫిల్మ్స్ 'బేపర్వా'



ప్రముఖ బాలీవుడ్ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ రూపొందిస్తున్న తాజా రొమాంటిక్ యాక్షన్ డ్రామాకు 'బేపర్వా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అహాన్ పాండే, షర్వరీ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'ఫియర్‌లెస్ ఇన్ లవ్' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. వచ్చే ఏడాది మార్చి 26న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు.
'సైయారా'చిత్రంతో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న అహాన్ పాండే ఈ సినిమాతో కెరీర్‌లో మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నారు. ప్రేమ, సంగీతం, యాక్షన్ ప్రధానాంశాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని తెలిసింది. దర్శకుడు అలీ అబ్బాస్ జాఫర్‌కు యశ్‌రాజ్ ఫిల్మ్స్‌లో ఇది ఐదో సినిమా. గతంలో ఆయన ఈ సంస్థలో మేరే బ్రదర్ కీ దుల్హాన్, గుండే, సుల్తాన్, టైగర్ జిందా హై వంటి చిత్రాలను తెరకెక్కించారు.

# నిత్యారెడ్డి స్పెషల్‌డ్యూటీ



అగ్ర కథానాయిక సాయిపల్లవి తొలిసారి పోలీస్ పాత్రలో కనిపించనుంది. సహజమైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించే ఆమె ఖాకీ డ్రెస్‌లో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నది. ధనుష్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఓం' సినిమాలో సాయిపల్లవి పోలీస్ అధికారి నిత్యారెడ్డి పాత్రను పోషిస్తున్నది. సోమవారం 'స్పెషల్ డ్యూటీ' పేరుతో ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'అమరన్' ఫేం రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ డ్రామా నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్‌షా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతాన్నందిస్తున్నారు. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# ప్రీమియర్స్ వేస్తే 'సైంటిస్టులు' వచ్చేస్తారు..

## పెయిడ్ రివ్యూలపై విశ్వక్ సేన్ సంచలన వ్యాఖ్యలు!



తెలుగు చిత్ర పరిశ్రమలో సినిమాల విడుదలకు ముందే మొదలవుతున్న ప్రతికూల ప్రచారంపై చర్చ రోజురోజుకూ పెరుగుతోంది. సినిమా విడుదల కాకముందే అంచనాలు పెంచడం, విడుదలైన వెంటనే నెగటివ్ ప్రచారాలు, సామాజిక మాధ్యమాల్లో లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేయడం వంటి పరిణామాలు నిర్మాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. తన తాజా చిత్రం 'కల్ట్'కు ప్రీమియర్లు నిర్వహించకపోవడానికి గల కారణంపై ఆయన వ్యంగ్యంగా స్పందించారు. విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్ట్' సినిమా అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ప్రీమియర్ల గురించి ఎదురైన ప్రశ్నకు విశ్వక్ తనదైన శైలిలో సమాధానమిచ్చినట్లు సమాచారం. ప్రీమియర్లు వేస్తే చాలు.. ఇక్కడ తిరిగే సైంటిస్టులు వెంటనే బయటకు వస్తారు. సినిమాను సినిమాగా చూడకుండా ప్రతి విషయంలోనూ భూతద్దం పెట్టి లాజిక్కులు వెతుకుతారు. అందుకే మా సినిమాకు ప్రీమియర్లు పెట్టడం లేదు. అందరం 30వ తేదీనే థియేటర్లలో చూద్దాం అంటూ ఆయన అన్నారు. సినిమాను ఆస్వాదించాల్సింది పోయి, ప్రతి సన్నివేశంలోనూ లోపాలు వెతుకుతూ అతిగా విమర్శించే వారిని ఉద్దేశించి విశ్వక్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు చర్చ జరుగుతోంది. అయితే ఆయన వ్యాఖ్యలు కేవలం సాధారణ విమర్శకులను ఉద్దేశించా ? లేక కావాలనే ప్రతికూల ప్రచారం చేసే వర్గాలను లక్ష్యంగా చేసుకున్నదా? అనేది స్పష్టంగా తెలియాల్సి ఉంది. సినిమా విజయం సాధించడంలో ప్రేక్షకుల ఆదరణతో పాటు ప్రచారం కూడా కీలక పాత్ర పోషిస్తోంది. అయితే కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రతికూల ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు సినీ పరిశ్రమలో తరచూ వినిపిస్తున్నాయి. నకిలీ ఖాతాల ద్వారా రేటింగ్‌లను ప్రభావితం చేయడం, సినిమా విడుదలైన వెంటనే నెగెటివ్‌గా ప్రచారం చేయడం, ప్రత్యేక వీడియోలు రూపొందించి సినిమాపై ఆసక్తిని దెబ్బతీయడం వంటి అంశాలపై పలువురు సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. నాని, విజయ్ దేవరకొండ, కిరణ్ అబ్బవరం వంటి హీరోలు సైతం గతంలో సినిమా పరిశ్రమలో ప్రతికూల ప్రచారంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# 'బ్లడీ రోమియో'లో బాలీవుడ్ నటుడు..
# కీలక పాత్రలో కనిపించనున్న 'ధురంధర్' ఫేమ్!

నేచురల్ స్టార్ నాని వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు దర్శకుడు సుజీత్‌తో కలిసి ఓ ఆసక్తికరమైన ప్రాజెక్ట్ చేస్తున్నారు. అదే 'బ్లడీ రోమియో'. డార్క్ యాక్షన్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త తెరపైకి వచ్చింది. బాలీవుడ్ నటుడు వివేక్ సిన్హా ఈ సినిమాలో కీలక పాత్రలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. నాని హీరోగా, సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న 'బ్లడీ రోమియో' చిత్రీకరణ ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో చిత్ర బృందం కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బాలీవుడ్ నటుడు వివేక్ సిన్హా కూడా షూటింగ్‌లో పాల్గొన్నారని, సినిమాలో ఆయన ఓ ముఖ్యమైన పాత్ర పోషించనున్నారని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. 'ధురంధర్' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న వివేక్ సిన్హా ఈ ప్రాజెక్టులో భాగం కావడం ఆసక్తికరంగా మారింది. అయితే ఆయన పాత్ర స్వభావం ఏమిటి? నాని పాత్రతో ఆయనకు ఎలాంటి సంబంధం ఉంటుంది? కథలో ఆయన పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉంటుంది? అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ వార్తపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నటీనటుల ఎంపికకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. 'బ్లడీ రోమియో'ను డార్క్ యాక్షన్ కామెడీగా రూపొందిస్తున్నారు. యాక్షన్‌తో పాటు వినోదాత్మక అంశాలు మిళితమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కనున్నట్లు సమాచారం. దర్శకుడు సుజీత్ గతంలో రూపొందించిన చిత్రాలు ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపును



తీసుకొచ్చాయి. ఇప్పుడు నానితో కలిసి ఆయన ఎలాంటి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారనే ఆసక్తి నెలకొంది. ఈ 'బ్లడీ రోమియో' చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్, యునానిమస్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

## భూభారతిలో అక్రమాలకు పచ్చజెండా..

**సక్రమ పట్టాలకు మాత్రం నో ఎంట్రీ!..**

**ఒకే సర్వే నంబరులో నిషేధిత భూమికి రిజిస్ట్రేషన్ ఎలా?**

**మార్కెట్ విలువ తగ్గించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారా?**

**మంథని ఎమ్మార్వో ఈ భూమిని ఎందుకు చేయటం లేదు...**



మంథని ( ప్రశ్న న్యూస్) భూభారతి పోర్టల్‌లో భూముల నమోదు వ్యవహారంపై అక్రమాలు జరిగాయంటూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మంథని రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నిషేధిత భూమికి రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని, మరోవైపు సక్రమమైన భూముల సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదని ఆయన ప్రశ్నించారు. భూముల రికార్డులు, మార్కెట్ విలువల నిర్ధారణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మంథని గ్రామంలోని సర్వే నంబర్ 94/బి (హెచ్. నంబర్ 2-5/ఏ)కు సంబంధించిన భూముల వ్యవహారంలో 1992 నాటి కట్టడాలు, ఇంటి రికార్డులు, 788/1982 డాక్యుమెంట్ వివరాలను ప్రస్తావిస్తూ ఫిర్యాదుదారు పలు సందేహాలు లేవనెత్తారు. సర్వే నంబర్ 94/డి, లోని భూమి నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. సుమారు 40 సెంట్ల భూమికి సంబంధించిన రికార్డులు, నిషేధిత జాబితా వివరాలను పరిశీలించి వాస్తవాలు వెల్లడించాలని కోరారు.సంబంధిత భూమి మార్కెట్ విలువ సుమారు రూ.82 లక్షలు ఉండగా, ఖాతా నంబర్ 61183, 0.0526 గుంటల విస్తీర్ణానికి రూ.5.60 లక్షలుగా విలువ చూపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.5,62,500 విలువ ఆధారంగా స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగినట్లు రాజగోపాల్ ఆరోపించారు. భూమి వాస్తవ మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకున్నారా? ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి నష్టం జరిగిందా? అనే అంశాలపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియలో నిబంధనలు పాటించారా? సంబంధిత అధికారుల అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. కలెక్టర్ లాగిన్ ద్వారా వివరాల్లో మార్పులు జరిగాయన్న ఆరోపణలపై సాంకేతిక రికార్డులను పరిశీలించి నిజానిజాలు తేల్చాలని కోరారు. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉందన్నారు. మంథని పరిధిలోని సర్వే నంబర్ 1112/ఏ, బి, సి, డి లోని రెండు ఎకరాల భూమికి సంబంధించి డాక్యుమెంట్ నంబర్ 2209/2011, పట్టా వివరాలు, ఎస్ఎల్ఎన్ఎస్/2020/1 దరఖాస్తు తేదీ 26-08-2020ను ఫిర్యాదులో ప్రస్తావించనన్నారు. సంబంధిత భూమి రికార్డులు, దరఖాస్తు స్థితి, రిజిస్ట్రేషన్ వివరాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు. భూభారతి పోర్టల్‌లో భూముల రికార్డుల నిర్వహణ, నిషేధిత జాబితా మార్పులు, మార్కెట్ విలువల నిర్ధారణపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని రాజగోపాల్ కోరారు. అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయడంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పనోడె మనీ కాజేశాడు. నమ్మకమే నా ఇల్లు గుల్ల చేసింది

**- "నమ్మకమే పెట్టుబడి-నేరమే గమ్యం."డబ్బే పరమావధిగా మారిన వేళ-కరిగిపోతున్న మానవ సంబంధాలు**

**- మారేడుపల్లిలో భారీ చోరీ కేసు-1.18కిలోల బంగారం,15లక్షలు నగదు స్వాధీనం- ఆలుమగలు వైద్యులు,"15"ఏళ్ల పరిచయంలో కోట్లు కొల్లగొట్టిన కేటుగాడు**

కంటోన్మెంట్ (ప్రెశ్న న్యూస్) రోజు రోజుకీ విస్తరిస్తున్న మహానగరాలు, మెట్రో పాలిటిన్ నగారాల్లో నేరాలు మనుషుల మధ్య సంబంధాలు, ముఖ్యంగా రక్త సంబంధాలు,ఉపాధి ఇచ్చే యజమానుల నమ్మకం కోల్పోతున్న ఈ తరం మనుషులు.ఇళ్లలో పనిచేసే వారి మధ్య ఉండాల్సిన సంబంధం.అలాగే నమ్మకం అనే పునాదిపై ఆధారపడి ఉంటుంది.

అయితే,ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాల్లో కొన్ని అవాంఛనీయ పరిణామాలు ఈ బంధాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నమ్మకంతో ఇంట్లోకి సెక్యూరిటీ గార్డ్స్ లేదా సహాయకులుగా చేర్చుకున్న కొంతమంది సేవకులు, డ్రైవర్లు, కేర్‌టేకర్లు కొద్దిరోజులకే రూపు మార్చుకుని దొంగలుగా మారుతున్న ఉదంతాలు సమాజాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

### నమ్మకమే పెను ప్రమాదం..

ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్ పల్లి నివాసితులైన డాక్టర్ ఆచీ మోహన్ కుటుంబం ఈనెల 19న తమ సొంత ఊరైన ఖమ్మం జిల్లా యెల్లందు వెళ్లిన వాళ్లు 20వ తారీకున తిరిగి వచ్చి చూసేసరికి వాళ్ళ ఇల్లు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు వెంటనే మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్వెస్టిగేషన్ మొదలు పెట్టిన పోలీసులకు నిందితుడు వెల్సాల భరత్ (38)ను పట్టుకున్నారు.

### నిందితుడు వృత్తిరీత్యా

గతంలో బాధితుడి ఇంటికి పనుల నిమిత్తం వెళ్లిన అనుభవం ఉండటంతో,ఇంట్లో విలువైన వస్తువులు ఎక్కడ ఉంచుతారో పూర్తి అవగాహన అతనికి ఉంది.దీన్ని ఆసరాగా చేసుకుని,ముందుగానే డూప్లికేట్ తాళం తయారు చేసిపెట్టుకున్నాడు.బాదితులు ఉరికి వెళ్లిన విషయం తెలుసుకున్న నిందితుడు ఇంట్లోకి ప్రవేశించి బెడ్‌రూమ్ లాక్‌ను పగలగొట్టి ఏకంగా 1.18కిలోల బంగారు ఆభరణాలు,15 లక్షల నగదును ఎత్తుకెళ్లాడు.ఫిర్యాదు అందడంతో రంగంలోకి దిగిన క్రైమ్ టీమ్,క్లూస్ టీమ్ సమాచారంతో నిందితుడు భరత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.విచారణలో నిందితుడు తను చేసిన నేరాన్ని అంగీకరించాడు.మొదట బోడుప్పల్‌లోని తన ఇంట్లో దాచిన చోరీ సొత్తును,ఎవరికీ అనుమానం రాకుండా పెద్ద అంబర్‌పేటలోని తన అత్తగారింట్లో దాచాడు.పోలీసుల సమక్షంలో సోదాలు నిర్వహించి,నిందితుడు దాచిన నగదును స్వాధీనం చేసుకున్నారు.మల్కాజ్‌గిరి జోన్ డీసీపీ పర్యావేక్షణలో ఏసీపీ బేగంపేట్ డివిజన్ గోపాలకృష్ణ మూర్తి, మారేడుపల్లి ఎస్‌హెచ్‌ఓ వీరబాబు ఇన్వెస్టిగేషన్ వేగవంతం చేసి కేసును ముగించారు.అలాగే ప్రజలకు వారి ఇంటి పరిసరాలలో సీసీ టీవీ కెమెరాలను అమర్చాలని సూచించారు,సీసీ కెమెరాలు ఇన్వెస్టిగేషన్కు చాలా ఉపయోగ పడుతుందని డిసిపి శ్రీధర్ తెలిపారు.అదిగాక సమాజంలో ఎవ్వరినీ తొందరగా






నమ్మదూ,ఎవరి పైనైన అనుమానాలు ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీస్ అధికారులు ప్రజలను కోరారు.

## తుర్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )తుర్కపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్, తనిఖీ చేశారు. చిన్నారుల ఆరోగ్యం.. గర్భిణుల పోషణపై ప్రత్యేక దృష్టి సారించారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహార భద్రత, గర్భిణుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవ్వాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆయన తుర్కపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్య, ఆరోగ్య, పోషకాహార సేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారానికి సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఆహార మెనూను పరిశీలించి, నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. కేంద్రంలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను పరిశీలించడంతో పాటు చిన్నారులకు పోషకాహారంలో భాగంగా అందించే కూరగాయలను పప్పు మరియు గుడ్ల నిల్వలను తనిఖీ చేసి, వాటి లభ్యతపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న పోషకాహార సహాయం, ఆరోగ్య సేవల గురించి ఆరా తీశారు. గర్భిణులకు అవసరమైన పోషకాహారం సకాలంలో అందించడం, వారి ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాలను నివారించేందుకు, తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య, పోషకాహార కార్యక్రమాల లక్ష్యం ప్రతి చిన్నారికి మెరుగైన ఆరోగ్యం, ప్రతి గర్భిణికి తగిన పోషకాహారం అందించడమేనని పేర్కొంటూ, ఆ లక్ష్య సాధనలో సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డాక్టర్ కె. ఆనంద్ సూచించారు. ఆహార సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు.

## బియ్యాన్ని కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి హెచ్చరిక**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) బియ్యాన్ని కృత్రిమ కొరత సృష్టించిన, అక్రమ నిలువలు చేసిన అధిక ధరలకు విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి హెచ్చరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బియ్యం లభ్యత,నిలువలు, ధరలపై మిల్లర్లు, హూల్ సెల్, రిటైల్డ్ వ్యాపారులతో జిల్లా పౌర సరఫరాల అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్లో వివిధ రకాల బియ్యం లబ్బిత నిలువలో వివరాలను ధరలను సమీక్షించారు. వినియోగదారులకు నిరంతరంగా బియ్యం సరఫరా జరిగేలా వ్యాపారులు తగినంత నిలువలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అవసరమైన మేరకు నిలువలను ఎప్పటికప్పుడు భక్తి చేసుకోవాలని బియ్యాన్ని న్యాయమైన ధరలకే విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సూచించారు. మార్కెట్లో బియ్యాన్ని కృత్రిమ కొరత సృష్టించడం అక్రమంగా నిలువలు చేయడం అధిక ధరలకు బియ్యాన్ని విక్రయించడం వంటి అక్రమ వ్యాపార పద్ధతులకు పాల్పడరాదని. ఒకవేళ అలాంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపార ప్రాంగణంలో స్టాక్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసి, వాటిపై బియ్యం రకం అందుబాటులో ఉన్న బియ్యం నిల్వాలా పరిమాణం కిలోకు విక్రయ ధరలను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. స్టాక్ బోర్డులోని వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని నిలువలు విక్రయాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బియ్యం సరఫరా లో ఏమైనా ఇబ్బందులు నిలువల కొరత ఏర్పడినట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, మార్కెట్లో ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు పౌరసరఫరాల శాఖకు పూర్తి సహకారం అందించాలని వ్యాపారులను కోరారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మార్కెట్లో బియ్యం లభ్యత, నిలువలు ధరలను పౌర సరఫరా శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. ప్రజల ఆందోళన చెందకుండా అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేయకుండా సహకరించాలని

## అసంఘటిత రంగ కార్మికుల

# స్వేచ్ఛ రథం ప్రారంభం

**జెండా ఊపి ప్రారంభించిన అదరపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**




మేడ్చల్( ప్రశ్న న్యూస్ )అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణ, వెట్టి చాకిరీ నిర్మూలన, కార్మికులపై జరుగుతున్న వివిధ రకాల దోపిడీని అరికట్టడం, ప్రభుత్వ కార్మిక సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం లక్ష్యంగా "అసంఘటిత రంగ కార్మికుల స్వేచ్ఛ రథం" జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురానుంది.ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సహాయ కార్మిక కమిషనర్, డి. రేణుక గోపిరెడ్డి. సాయి సుమన్, ఆంజనేయులు సహయ కార్మిక అధికారులు, ఖలీల్ వీరస్వామి డీసీపీఓ స్టాఫ్, వివిద శాఖల అధికారులు జేఎం (ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్) ఈ కార్యాక్రమములో పాల్గొన్నారు.ఈ ప్రచార రాధానికి జిల్లా అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించినారు. పోస్టర్ ఆవిష్కరించినారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, ఇటుక బట్టీల కార్మికులు, చిన్న పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, వలస కార్మికులు, గృహ కార్మికులు, ఇతర అసంఘటిత రంగ కార్మికులకు వారి హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య కార్యక్రమాలుస్వేచ్ఛ రథం గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలు, నిర్మాణ ప్రదేశాలు, పారిశ్రామిక ప్రాంతాలు, మార్కెట్లు, ఇతర కార్మికులు అధికంగా పనిచేసే ప్రాంతాలను సందర్శిస్తూ ప్రజా సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు, కరపత్రాల పంపిణీ ద్వారా అవగాహన కల్పించనుంది. కార్మికుల సమస్యలను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టనున్నారు.కార్మికులపై జరిగే దోపిడీని అరికట్టడం, ప్రతి కార్మికుడికి గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించడం, కార్మిక కుటుంబాలకు సామాజిక భద్రతను బలోపేతం చేయడం ప్రభుత్వ యంత్రాంగం, యజమానులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాల్సిన అంశాలని ఈ కార్యక్రమం తెలియజేస్తుంది."వెట్టి చాకిరీ నిర్మూలన మన లక్ష్యం - కార్మికుల స్వేచ్ఛ మన బాధ్యత - కార్మికుల హక్కుల పరిరక్షణ మన కర్తవ్యం" అనే సందేశంతో స్వేచ్ఛ రథం జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించనుంది అని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు . జిల్లాలో వెట్టి చాకిరీ నిర్మూలన లక్ష్యం అని తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కోర్టు కొరడా

**17 మందికి జైలు శిక్ష, రూ. 22,500 జరిమాన**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై న్యాయస్థానం కఠిన చర్యలు చేపట్టింది. మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన విస్తృత తనిఖీల్లో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 17 మందికి న్యాయస్థానం జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించింది.మేడ్చల్‌లోని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, ఎనిమిదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో మంగళవారం మొత్తం 24 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు విచారణకు వచ్చాయి. కేసులను క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో 17 మందికి జైలు శిక్ష ఖరారు చేశారు. ఇందులో 11 మందికి 2 రోజులు, నలుగురికి 3 రోజులు, ఇద్దరికి 5 రోజుల చొప్పున జైలు శిక్ష విధించడంతో పాటు నిందితులందరికీ కలిపి మొత్తం రూ.22,500 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని హెచ్చరించారు. దీనివల్ల డ్రైవర్ల ప్రాణాలతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతర అమాయకుల ప్రాణాలకు సైతం పెను ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో సరిపెట్టకుండా జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# భక్తసేవే ప్రథమం.. బ్రహ్మోత్సవాలే స్ఫూర్తి

**సమష్టి కృషితో విజయవంతమైన శ్రీవారి ఉత్సవాలు..**

**ముడిసరుకుల కొనుగోలుకు 90 రోజుల ముందే ప్రణాళిక**



తిరుపతి (ప్రశ్న న్యూస్) భక్తులకు సంతృప్తికరమైన దర్శనం.. సౌకర్యవంతమైన వసతి.. నాణ్యమైన అన్నప్రసాదం.. ఆధ్యాత్మికత ఉట్టిపడే వాహన సేవలు.. సమన్వయంతో సాగిన ఏర్పాట్లు.. ఇవే శ్రీవారి బ్రహ్మోత్సవాల విజయానికి కొలమానాలని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర స్పష్టం చేశారు. లక్షలాది మంది భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో టీటీడీలోని అన్ని విభాగాలు సమష్టిగా కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అదే సమయంలో, ఉత్సవాల నిర్వహణలో ఎదురైన ఇబ్బందులను విశ్లేషించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో శ్రీవారి వార్షిక, నవరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ తీరును ఈవో సమీక్షించారు. వివిధ విభాగాలు అందించిన సేవలు, భక్తులకు కల్పించిన సౌకర్యాలు, ఉత్సవాల సందర్భంగా ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలపై చర్చించారు. తొలి రోజుల్లో ఎదురైన చిన్నపాటి ఇబ్బందులను గుర్తించి, వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా సేవలను మెరుగుపరచడం సానుకూల పరిణామమని అభిప్రాయపడ్డారు.

### భక్తుల సంతృప్తే విజయానికి అసలైన కొలమానం..

బ్రహ్మోత్సవాల వంటి భారీ ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈవో సూచించారు. అన్నప్రసాదం విభాగం లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన ఆహారం అందించిందని ప్రశంసించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించగా, ఆరోగ్యశాఖ తిరుమలలో పారిశుధ్య నిర్వహణను సమర్థంగా చేపట్టిందన్నారు. కల్యాణకట్ట, వైద్య, రవాణా, వసతి, అటవీ విభాగాలు అందించిన సేవలను అభినందించారు.ఆలయం లోపల, వెలుపల గార్డెన్, ఎలక్ట్రికల్ విభాగాలు ఏర్పాటు చేసిన పుష్పాలంకరణలు, విద్యుద్దీపాలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణలు ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయని పేర్కొన్నారు.

వివిధ ప్రదర్శనశాలలు కూడా భక్తులకు ఆకర్షణగా నిలిచాయని చెప్పారు.టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో (విద్య, ఆరోగ్యం) సి. గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ విభాగాల పనితీరును వివరించారు. అన్ని విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# విషవలయంలో మేడ్చల్

# స్తంభించిన చెత్త సేకరణ

-పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రైల్వే కాలనీ వాసులు-ప్రైవేట్ ప్లాట్లలో చెత్త పోత.. వాహనాలను నిలిపివేసిన కాలనీవాసులు

-చెత్త వాహనాలకు బ్రేక్.. సర్కిల్ వ్యాప్తంగా స్తంభించిన పారిశుధ్యం- తాత్కాలిక హామీలు చాలు.. డంపింగ్ యార్డును వెంటనే తరలించండి

- ముగిసిన టెండర్లు.. మొదలైన కష్టాలు- సుమారు ?15 గ్రామాల వ్యర్థాలకు ఒకటే అడ్డా.. రైల్వే కాలనీవాసులకు తప్పని ముప్పు

- హామీలకే పరిమితమైన పరిష్కారం.. మేడ్చల్ సర్కిల్‌లో గాడితప్పిన పారిశుధ్య వ్యవస్థ





మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. గత రెండు రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోవడం ఒకవైపు, రైల్వే కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న విషపూరిత పొగ మరోవైపు స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇళ్ల ఎదుట పేరుకుపోయిన వ్యర్థాలతో దుర్వాసన భరించలేక, అటు డంపింగ్ యార్డు మంటల పొగతో శ్వాస తీసుకోలేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

### ప్లాట్లలో డంపింగ్.. వాహనాలను అడ్డుకున్న రైల్వే కాలనీవాసులు

మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో సేకరించిన వ్యర్థాలను వేయడానికి మరింత ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పారిశుధ్య సిబ్బంది స్థానిక రైల్వే కాలనీ సమీపంలోని ఖాళీ ప్రైవేట్ ప్లాట్లలో పారబోస్తున్నారు. నివాసాల మధ్య చెత్త వేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కాలనీవాసులు చెత్త వాహనాలను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ప్రైవేట్ ప్లాట్లను అనధికారిక డంపింగ్ యార్డులుగా ఎలా మారుస్తారంటూ నిలదీశారు. స్థానికుల నిరసనతో సర్కిల్ వ్యాప్తంగా చెత్త సేకరణ ప్రక్రియ పూర్తిగా స్తంభించిపోయింది. రెండు రోజులుగా వాహనాలు రాకపోవడంతో కాలనీల్లో చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది.

### టెండర్ల జాప్యమే శాపం.. అధికారుల వివరణ

చెత్త సేకరణ నిలిచిపోవడంపై అధికారులను వివరణ కోరగా, పాత కాంట్రాక్ట్ గడువు ముగియడమే ఈ సమస్యకు కారణమని తెలిపారు. కొత్త టెండర్ల ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు 10 రోజుల సమయం పట్టిందని, ఇటీవలనే టెండర్లు రీ-ఓపెన్ చేసి సమస్యను పరిష్కరించామని స్పష్టం చేశారు. సర్కిల్ పరిధిలోని దాదాపు 8 ట్రాక్టర్లు, 40 ఆటోల ద్వారా త్వరలోనే పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

### అర కిలోమీటరు మేర చెత్త కుప్పలు.. రగులుతున్న విషజ్వాలలు

రైల్వే కాలనీ సమీపంలో దాదాపు అర కిలోమీటరు మేర విస్తరించిన డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలకు పెను ముప్పుగా పరిణమించింది. సుమారు 10 నుంచి 15 గ్రామాల వ్యర్థాలను ఇక్కడే డంప్ చేస్తుండటంతో చెత్త కొండలా పేరుకుపోయింది. ఈ చెత్త కుప్పలకు నిప్పు పెడుతుండటంతో భారీగా రసాయన పొగ వెలువడుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ దట్టమైన పొగ మంచులా కమ్ముకుంటూ ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

### తాత్కాలిక హామీలు వద్దు.. శాశ్వత పరిష్కారమే ముద్దు

ఈ సమస్యపై పురపాలక యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పది రోజుల్లో సమస్య తీరుస్తామంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సరైన చర్యలు



చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నివాస ప్రాంతాల నడుమ ఉన్న ఈ డంపింగ్ యార్డును తక్షణమే దూర ప్రాంతానికి తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# హెల్మెట్ లేకుండా డ్రైవింగ్..

# ప్రాణాలతో చెలగాటం

- జరిమానా భయంతో కాదు.. ప్రాణాలపై బాధ్యతతో ధరించాలి

-చిన్న నిర్లక్ష్యం.. కుటుంబానికి తీరని శోకం - వెనుక కూర్చున్నవారికీ హెల్మెట్ తప్పనిసరి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రోడ్డుపై ద్విచక్ర వాహనాల రాకపోకలు నిత్యజీవితంలో భాగమయ్యాయి. ఉద్యోగాలకు వెళ్లేవారు, విద్యార్థులు, చిరు వ్యాపారులు, కుటుంబ అవసరాల కోసం ప్రయాణించేవారు నిత్యం బైక్‌లు, స్కూటీలను వినియోగిస్తున్నారు. అయితే వాహనం నడిపేటప్పుడు పాటించాల్సిన భద్రతా నియమాల్లో హెల్మెట్ ధరించడం అత్యంత కీలకం. అయినప్పటికీ కొందరు హెల్మెట్ లేకుండానే రోడ్లపైకి వస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు కనిపిస్తే హెల్మెట్ పెట్టుకోవడం.. వారు కనిపించకపోతే తీసేయడం వంటి నిర్లక్ష్య ధోరణి ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతోంది.

### కొద్ది దూరమే కదా.. అనే నిర్లక్ష్యమే ప్రమాదం

ఇంటి నుంచి దుకాణం వరకు, కాలనీ నుంచి ప్రధాన రహదారి వరకు, కార్యాలయానికి వెళ్లే మార్గంలో కొద్ది దూరమే ప్రయాణిస్తున్నామని చాలామంది హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్నారు. కానీ ప్రమాదం ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఎదురు నుంచి వచ్చే వాహనం ఢీకొట్టినా, అకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చినా, రోడ్డుపై జారిపడినా తలకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదం ఉంది. తక్కువ వేగంతో వెళ్తున్నప్పటికీ ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అందుకే దూరంతో సంబంధం లేకుండా ప్రతి ప్రయాణంలోనూ హెల్మెట్ ధరించాలి.

### తలకు రక్షణ.. ప్రాణాలకు భరోసా

ప్రమాద సమయంలో తలకు తగిలే దెబ్బలు ప్రాణాపాయానికి దారితీయవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సమాచారం ప్రకారం, నాణ్యమైన హెల్మెట్‌ను సరిగ్గా ధరించడం వల్ల ప్రమాదంలో మరణించే ప్రమాదం ఆరు రెట్లకు పైగా తగ్గే అవకాశం ఉంది. మెదడు గాయాల ప్రమాదం 74 శాతం వరకు తగ్గవచ్చు. ఈ గణాంకాలే హెల్మెట్ ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. హెల్మెట్ ధరించడం వల్ల ప్రతి ప్రమాదం నుంచి పూర్తి రక్షణ లభిస్తుందని చెప్పలేకపోయినా, తీవ్ర గాయాల ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు.

### డ్రైవర్‌కే కాదు.. వెనుక కూర్చున్నవారికీ

చాలామంది వాహనం నడిపే వ్యక్తి మాత్రమే హెల్మెట్ ధరిస్తే సరిపోతుందని భావిస్తారు. కానీ వెనుక కూర్చున్న ప్రయాణికుడికీ ప్రమాదం జరిగే అవకాశం సమానంగానే ఉంటుంది. ప్రమాద సమయంలో వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా రోడ్డుపై పడిపోవచ్చు. అందువల్ల ఇద్దరూ హెల్మెట్



ధరించడం అవసరం. కుటుంబ సభ్యులు, స్నేహితులు, పిల్లలతో ప్రయాణించేటప్పుడు వారి భద్రతను కూడా నిర్లక్ష్యం చేయకూడదు.

### జరిమానా తప్పించుకోవడానికే కాదు.. ప్రాణాలు కాపాడుకోవడానికి

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం మోటారు వాహనాల చట్టంలోని నిబంధనలకు విరుద్ధం. సెక్షన్ 129 ప్రకారం, మినహాయింపులు వర్తించే సందర్భాలు మినహా, నాలుగు సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సున్న ద్విచక్ర వాహన చోదకులు, ప్రయాణికులు నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణమైన హెల్మెట్ ధరించాలి. సెక్షన్ 194డ ప్రకారం నిబంధన ఉల్లంఘనకు రూ.1,000 జరిమానా, మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంపై అనర్హత విధించే నిబంధన ఉంది.

అయితే హెల్మెట్ వినియోగాన్ని కేవలం జరిమానాతో ముడిపెట్టకూడదు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పుడే కాకుండా, ప్రతి ప్రయాణంలోనూ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించుకోవచ్చు.

### నాణ్యత లేని హెల్మెట్ ధరించినా ప్రయోజనం ఏమిటి.?

తక్కువ ధరకు లభించే నాసిరకం హెల్మెట్లు కొనుగోలు చేయడం, నాణ్యతను పట్టించుకోకుండా హెల్మెట్ ధరించడం కూడా



ప్రమాదకరమే. భారతీయ ప్రమాణాల సంస్థ ధ్రువీకరణ కలిగిన హెల్మెట్‌ను ఎంచుకోవాలి. తలకు సరిగ్గా సరిపోయేలా ధరించి, పట్టీని బిగించాలి. హెల్మెట్‌ను తలకు పెట్టుకుని పట్టీ బిగించకుండా వదిలేస్తే ప్రమాద సమయంలో అది జారిపోయే అవకాశం ఉంది. దెబ్బతిన్న హెల్మెట్‌ను ఉపయోగించకూడదు.

### కుటుంబం కోసం.. బాధ్యతగా వ్యవహరించాలి

ఒక వ్యక్తి ప్రమాదానికి గురైతే నష్టం అతనికే పరిమితం కాదు. అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లలు తల్లిదండ్రులను కోల్పోవచ్చు. కుటుంబ పెద్ద ప్రమాదానికి గురైతే జీవనాధారం దెబ్బతినవచ్చు. అందుకే ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి బయలుదేరే ముందు హెల్మెట్ ధరించడాన్ని అలవాటుగా మార్చుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి. వాహనం నడిపేటప్పుడు అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలి.

### పోలీసుల నిఘాతో పాటు ప్రజల్లోనూ మార్పు రావాలి

హెల్మెట్ వినియోగంపై ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థలు, కార్యాలయాలు, కాలనీల్లో రోడ్డు భద్రతపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిని గుర్తించి నిబంధనలపై అవగాహన కల్పించాలి. అదే సమయంలో ప్రజలు కూడా పోలీసుల భయంతో కాకుండా స్వచ్ఛందంగా భద్రతా నియమాలను పాటించాలి.

## బాలాజీ స్కూల్ 1984 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సికింద్రాబాద్(ప్రశ్న న్యూస్)** బాలాజీ స్కూల్ బౌధనగర్ 1984,85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈ రోజు సికింద్రాబాద్‌లోని డెక్కన్ క్లబ్‌లో ఆనందోత్సాహాల మధ్య బిల్డర్ దాయానంద్ నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, ఆత్మీయంగా గడిపారు.పాఠశాల రోజుల్లోని మధురానుభూతులు, స్నేహితులతో కలిసి చేసిన అల్లరి, అప్పటి విశేషాలను పరస్పరం పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. చదువు పూర్తయి దశాబ్దాలు గడిచినా తమ మధ్య స్నేహబంధం చెక్కుచెదరకుండా ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.కాలక్రమంలో ఎవరి జీవితాల్లో వారు స్థిరపడినా, పాత స్నేహితులను మళ్లీ కలుసుకోవడం ప్రత్యేక అనుభూతిని కలిగించిందని నిర్వాహకులు మోహన్,రాజకుమార్,సత్యం గౌడ్ పేర్కొన్నారు. ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థుల మధ్య ఆత్మీయతను మరింత పెంపొందించడంతో పాటు, పాత జ్ఞాపకాలను మరోసారి గుర్తుచేసుకునే వేదికగా నిలిచింది.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పరస్పరం యోగక్షేమాలు తెలుసుకుంటూ, భవిష్యత్తులోనూ ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. బాలాజీ స్కూల్ 1984 బ్యాచ్ స్నేహబంధం ఎప్పటికీ కొనసాగాలని అభిలషించారు.దశాబ్దాలు గడిచినా చెక్కుచెదరని స్నేహానికి ఈ ఆత్మీయ సమ్మేళనం నిదర్శనంగా నిలిచింది.

## ఎల్‌నినో ప్రభావంతో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం: మంత్రి పొంగులేటి



**సంగారెడ్డి జిల్లా (ప్రశ్న న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో అన్ని ప్రాజెక్టులు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రైతులు చాలా అనుభవజ్ఞులని.. ఈ కరువుపై దృష్టి పెట్టి రెండో పంటను వేయొద్దని కోరారు. ప్రతిపక్షాలు కూడా ఉన్న వాస్తవాన్ని అన్నదాతలకు చెబితే బాగుంటుందని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) సంగారెడ్డిలో మంత్రులు పొంగులేటి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి పర్యటించారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలోని జడ్పీ హాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎంపీ రఘునందన్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. ధరణిని బంగాళాఖాతంలో వేసి భూ భారతిని తీసుకువచ్చామని వెల్లడించారు.125 ఏళ్ల క్రితం పూర్తి భూ సర్వే జరిగితే... మళ్లీ ఇప్పుడు భూముల రీ సర్వే చేస్తున్నామని మంత్రి పొంగులేటి వివరించారు. 380 గ్రామాల్లో ఇప్పటివరకు పూర్తిగా భూ సర్వే పూర్తి అయిందని తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో వారికి భూమి హక్కు పత్రాలు ఇచ్చామని స్పష్టం చేశారు. 900 గ్రామాల్లో భూ సర్వే చివరి దశకు వచ్చిందని ప్రస్తావించారు. ఏడాదిన్నరలోపు తెలంగాణలో ఈ భూ సర్వే పూర్తవుతుందని చెప్పుకొచ్చారు. వివాదరహితమైన భూములను రాబోయే తరానికి అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ఆధార్ ఎలా ఉందో భూదార్ అలా ఉండబోతుందని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల్లో కట్టుకునే ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం ఆలస్యమైందని మంత్రి పొంగులేటి అన్నారు. తాజాగా కేంద్రం 2 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు బొమ్మలకు మాత్రమే పరిమితం అయ్యాయని విమర్శించారు. తమది ప్రజాప్రభుత్వమని.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవాడికి రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారు.బుధవారం అఖిలపక్ష సమావేశం జరుగుతుందని వెల్లడించారు. అఖిలపక్షంతో కలిసి కేంద్ర ప్రభుత్వ పెద్దలను త్వరలోనే కలుస్తామని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన నిధులపై ప్రతిపక్షాలను తీసుకుని ఢిల్లీకి వెళ్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో భారీ పేలుడు



**(ప్రశ్న న్యూస్)హైదరాబాద్, :** హైదరాబాద్‌లో భారీ పేలుడు (కెమికల్ బ్లాస్ట్) జరిగింది. కాటేదాన్‌లోని బాటిళ్ల తయారీ కంపెనీలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో సాయి అనే వ్యక్తికి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటినా ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.అలాగే కాలిపాదం సగం మేరకు తెగిపోవడంతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందగానే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588